చికెన్ ధరలు

లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66

ఉష్ణోగ్రత

గరిష్ఠం	37.5
కనిష్ఠం	24.0


పట్టుదలకు సరస్వతీ ప్రసన్నం

పట్టుదలకు మారుపేరుగా నిలుస్తోంది పుట్టల ప్రసన్న. తల్లిదండ్రులు చిన్నతనంలోనే దూరమైనా నానమ్మ సంరక్షణలో పెరిగి దీక్షగా చదివింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇచ్చిన స్ఫూర్తితో హాస్టల్‌లో అదనంగా గంట పాటు చదివి అందరికంటే చివరగా నిద్రపోయేది. కృషికి తగ్గట్టుగా పదో తరగిలో 563 మార్కులు (10జీపీఏ) సాధించి టాపర్‌గా నిలిచి విమాన ప్రయాణం చేసింది.

6

ప్రజల ప్రాణాలతో
చెలగాటం

- ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్న నకిలీ వైద్యులు
- పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ
- నకిలీ వైద్యులపై మెడికల్ కౌన్సిల్ చర్యలు



రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా జిల్లాలో మాత్రం నకిలీ వైద్యుల బెడద తప్పడం లేదు. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో నకిలీ వైద్యులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గతంలో కొందరు కాంపౌడర్‌లుగా పనిచేసి టీఎస్ఎంపీఆర్ నిబంధనలకు విరుద్ధంగా వైద్యులుగా చెలామణి అవుతూ అందరినీ మోసం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులబారిన పడిన వారిని పట్టణ ప్రాంతాలల్లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్‌చేసి వాటి సహాయంతో రోగుల నుంచి డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అవసరంలేని పరీక్షలు చేయిస్తూ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పర్సంటేజీలు ఇస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. కొందరు అర్హత లేకున్నా, ఆర్ఎంపీగా బోర్డు ఏర్పాటుచేసి అక్రమంగా అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు వినికిడి. క్లినిక్‌లతో పాటు ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లను అడ్డగోలుగా ఏర్పాటుచేసి వైద్యులమని నమ్మబలుకుతూ ఇష్టానుసారంగా యాంటీబయాటిక్, స్టెరాయిడ్స్, నొప్పి నివారణ ఇంజక్షన్‌లు ఇస్తూ రోగుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు.

పట్టించుకోని వైద్యఆరోగ్యశాఖ...

జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ నకిలీ వైద్యులపై పట్టనట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు అసలు దృష్టి సారించకపోవడంతో నకిలీ ఆర్ఎంపీల ఇష్టారాజ్యమైంది. తెలిసీ తెలియని వైద్యం చేసి, రోగుల పరిస్థితి విషమించిన తరువాత పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి విలువైన ప్రాణాలు తీస్తున్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో మొత్తం నకిలీ వైద్యులదే హవాగా మారింది. కొన్నేళ్లుగా వీరిపై ఫిర్యాదులు వస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల నల్లగొండ, కోదాడ, మిర్యాలగూడ, సూర్యాపేటలో ప్రైవేట్ ఆస్పత్రులు పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యాయి. నల్లగొండ పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రుల

- మిగతా 8వ పేజీలో...



రైతులు కోల్పోయిన బోనస్
రూ.845కోట్లు

- మిల్లులకు సన్నధాన్యం విక్రయించడంతో ఈ పరిస్థితి
- ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించిన ధాన్యం 4శాతమే
- బోనస్ కోల్పోతున్నా, ధర తక్కువ ఇచ్చినా పట్టించుకోని వైనం
- తేమ, తాలు నిబంధనలే కారణమంటున్న రైతులు
- నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లకు గడువు

సన్నధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్నా రైతులు పట్టించుకోలేదు. సన్నధాన్యం పండించడానికి పోటీపడ్డ రైతులు, విక్రయాల్లో మాత్రం ప్రభుత్వ సూచనలు పట్టించుకోకుండా, నేరుగా మిల్‌పాయింట్లు, వ్యాపారులకే విక్రయించారు. దీంతో బోనస్ కోల్పోవడమే గాక, తక్కువ ధర వచ్చినా, రైతులు వ్యాపారులకు ధాన్యం విక్రయించేందుకు మొగ్గుచూపారు. ఫలితంగా ఉమ్మడి జిల్లా రైతులు రూ.845కోట్ల బోనస్‌ను కోల్పోయారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

యాసంగి సీజన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 17.57లక్షల మెట్రిక్‌టన్నుల సన్నధాన్యం దిగుబడి రాగా, అందులో కేవలం 4 శాతం మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. మిగిలిన ధాన్యం మొత్తం మిల్‌పాయింట్ల వద్ద వ్యాపారులే కొనుగోలుచేశారు. ధాన్యం ముమ్మరంగా వచ్చినప్పుడు, పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం వచ్చినప్పుడు కనీస మద్దతు కంటే ధర తగ్గించినా మిల్లుల వద్ద విక్రయానికే రైతులు మొగ్గుచూపారు. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించకపోవడంతో రైతులు సుమారు రూ.845కోట్ల బోనస్‌ను కోల్పోయారు. కేంద్రాల వద్ద సన్నధాన్యం విక్రయించకపోవడానికి కారణాలను ప్రభుత్వం విశ్లేషించాల్సి ఉంటుందని, లేదంటే ప్రభుత్వం సన్నబియ్యాన్ని మిల్లర్ల వద్ద కొనుగోలు చేస్తే తప్ప వినియోగదారులకు పంపిణీచేయలేని పరిస్థితి ఎదుర్కోవల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సన్నధాన్యం కొనుగోళ్లలో హవా చాటిన మిల్లర్లు

ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో దాదాపు 29.28లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి

- మిగతా 7వ పేజీలో...

నెలాఖరు వరకు కొనుగోళ్లు...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 1,053 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 29.19లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వరి భారీగా సాగు కావడం, దిగుబడి సైతం భారీగా రావడంతో నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో గతవారం వరకు కేంద్రాల వద్ద ఎటుచూసినా ధాన్యం రాశులే కనిపించాయి. కాంటాల కోసం రైతులు, కేంద్రాల నిర్వాహకులు అవస్థలుపడాల్సిన పరిస్థితి కొనసాగింది. కలెక్టర్లు సైతం నేరుగా రంగంలోకి దిగి కాంటాలు, రవాణాపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవడంతో ఈ రెండు జిల్లాల్లో పరిస్థితి కుదుటపడగా, సూర్యాపేట జిల్లాలో ఇంకా కేంద్రాల వద్ద ఒత్తిడి కొనసాగుతూనే ఉంది. కాంటాలు వేస్తున్నప్పటికీ ఆ జిల్లాలో మిల్లులు తక్కువగా ఉండడం, నల్లగొండ జిల్లాలోని మిల్లులకు ధాన్యం కేటాయించడంతో రవాణాలో జాప్యం జరుగుతుండడంతో ఈ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఒత్తిడి యథావిధిగా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ మూడు జిల్లాల్లో కలిపి 10.80మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇంకా కేంద్రాల వద్ద, రైతుల కల్లాల వద్ద ధాన్యం భారీగానే ఉంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నెలాఖరువరకు కేంద్రాలను కొనసాగించాల్సి ఉంటుందనే అంచనాకు వచ్చిన అధికార యంత్రాంగం ఆయా గ్రామాల్లో పరిస్థితికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను మూసివేస్తూ, ధాన్యం వస్తున్న కేంద్రాలను కొనసాగిస్తున్నారు. నెలాఖరు వరకు ఇలాగే వచ్చిన ధాన్యం వచ్చినట్టు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు.



చెల్లించాల్సిన బోనస్ పెండింగ్

ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన సన్న ధాన్యానికి సంబంధించి బోనస్ ఇంకా రైతుల ఖాతాల్లో జమకాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 68,971 మెట్రిక్‌టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేయగా, అందుకుగాను రూ.34.48కోట్ల విలువైన బోనస్ రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే రైతుల ఖాతాల వివరాలు సేకరించిన పౌరసరఫరాలశాఖ ఆన్‌లైన్‌లో వాటి నమోదును కూడా పూర్తి చేసింది. తొలుత ధాన్యం బిల్లులు క్లియర్ చేస్తుండడంతో అవి కొలిక్కి వచ్చాక బోనస్‌ను ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ వారాంతంలోగా బోనస్ మొత్తం రైతుల ఖాతాల్లో నేరుగా జమవుతుందని వారు పేర్కొంటున్నారు.


ఇళ్ల స్థలాలపై హక్కులు కల్పించాలి

రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

గట్టుప్పల్, మే 19 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం ప్రకారం అసైన్డ్, ఇళ్ల స్థలాలకు హక్కులు కల్పించాలని రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ భారతిలో లోపాలను కూడా సరిచేయాలన్నారు. ధరణిలో ఉన్న లోపాలను అధిగమించామని ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే లోపాలను సరిచేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, నాయకులు చాపల మారయ్య, కర్నాటి మల్లేశం, సాగర్ల మల్లేష్, జెర్రిపోతుల ధనుంజయ, మిర్యాల భరత్, వరికుప్పల ముత్యాలు, కర్నాటి సుధాకర్, పగిళ్ల శ్రీనివాస్, వేముల లింగస్వామి, కర్నాటి వెంకటేశం, పగిళ్ల యాదయ్య, పెద్దగాని నరసింహ, ముసుకు బుచ్చిరెడ్డి, పబ్బు మారయ్య, కృష్ణయ్య, ఈరటి వెంకటయ్య పాల్గొన్నారు.



డిండి మండలం కందుకూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

డిండి, మే 19(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండలంలోని కందుకూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సుమారు 200 లారీల ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని తెలిపారు. అధికారులు, అధికారపార్టీ ఎమ్మెల్యేలు రైతులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కష్టపడి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే దుస్థితి లేదని వాపోయారు. విక్రయించిన ధాన్యం డబ్బు కోసం రైతులు రోజులతరబడి ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఆసరా చేసుకొని వ్యాపారులు, మిల్లర్లు రైతులను నిలువుదోపిడి చేస్తున్నారని విమర్శించారు. తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి లారీల కోసం పడిగాపులుకాయలేక రైతులు వ్యాపారులకు నష్టానికే ధాన్యం విక్రయించే దుస్థితి ఏర్పడిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లాలు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, ఏటి కృష్ణ, బర్పటి కొండల్, సాయికుమార్, ముడి శ్రీకాంత్, రమేష్, వెంకటేష్, ప్రసాద్, భాస్కర్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

● ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ



నల్లగొండలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): 'ప్రజావాణి' ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. సుమారు 97 మంది ఫిర్యాదులు అందజేయగా, అందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందినవి 53 వరకు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ వారం ఫిర్యాదుదారుల సంఖ్య పెరుగుతున్నందున జిల్లా అధికారులు శ్రద్ధ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఒకవేళ సమస్య పరిష్కారంకాకుంటే ఎందుకు కాలేదో స్పష్టంగా తెలియజేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. భవిత కేంద్రాల్లో సౌకర్యాలు, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోలు, తాగునీరు, విద్యుత్, టీఎస్ ఐపాస్, టీప్రైడ్ అంశాలను సమీక్షించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్‌అమిత్, రాజ్‌కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఆర్‌వో వై.అశోక్‌రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

'రాజీవ్ యువ వికాసం'లో జిల్లాను ముందుంచాలి

నల్లగొండ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం అమలులో జిల్లాను ముందుంచేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బ్యాంక్ కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పథకం కింద వచ్చిన దరఖాస్తులను బ్యాంకర్లు సిబిల్‌ను వెంటనే పరిశీలించి ఎంపీడీవోలకు అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ప్రతీ దశకు ఒక సమయాన్ని నిర్దేశించి, ఆలోగా అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీచేసిందన్నారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 73,646 దరఖాస్తులు రాగా, అర్హత ఉన్న 73,200 దరఖాస్తుల సిబిల్‌ను పరిశీలించి సంబంధిత ఎంపీడీవోలకు అందజేయాలన్నారు. ఎంపీడీవోలు వారి స్థాయిలో అన్ని అర్హతలు పరిశీలించి ఈనెల 25లోగా లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని ఆదేశించారు. కాగా, ఇప్పటివరకు బ్యాంకర్లు 11వేల దరఖాస్తుల సిబిల్ పరిశీలించి ఎంపీడీవోలకు అందజేశారని, 6,500 దరఖాస్తులను అప్డేట్ చేసినట్లు లీడ్ బ్యాంక్ అధికారి శ్రామిక్ వివరించారు. మిగిలినవి వెంటనే పరిశీలించి ఎంపీడీవోలకు అందజేస్తామన్నారు. మంగళవారం నాటికి 60 శాతం పురోగతి సాధించాలని కలెక్టర్ కోరారు. బ్యాంకర్లు జాప్యంచేస్తే సమస్యను ఫైనాన్స్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే లబ్ధిదారులకు సబ్సిడీ, రుణాన్ని మంజూరు చేసేందుకు వెంటనే బ్యాంకు ఖాతాను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ శేఖర్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఖాజా నసీరుద్దీన్, విజయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యాసంస్థలో ప్రవేశం పొందాలి

మైనార్టీ విద్యాసంస్థల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు సమీపంలోని మైనార్టీ విద్యాసంస్థల్లో సంప్రదించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ, జిల్లాలో 13 మైనార్టీ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, వీటిలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒక్కో తరగతిలో సుమారు 60 వరకు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ముందుగా వచ్చిన వారికి ముందుగా కేటాయించే పద్ధతిని పాటిస్తామని తెలిపారు. వివరాలకు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ సెల్ నంబర్ 7331170877లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విద్యాసంస్థల జిల్లా అధికారి విజయేందర్‌రెడ్డి, ఆర్‌సీవో విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటం, త్యాగాల తొవ్వలోనే సమసమాజం

- కమ్యూనిస్టు చుక్కాని సుందరయ్య
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



సుందరయ్య వర్ధంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న పార్టీ నాయకులు

మిర్యాలగూడ, మే 19(ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోరాటం, త్యాగాల తొవ్వలోనే సమసమాజ స్థాపన సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఈదులగూడెం చౌరస్తాలోని సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని సీనియర్ నేత పారేపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం ఈదులగూడెం నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా సీపీఎం కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 35 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ సిద్ధాంతం, ఆచరణ మేళవించిన గొప్ప ఆదర్శనాయకుడు సుందరయ్య అని అన్నారు. ధనిక కుటుంబంలో పుట్టినప్పటికీ నిత్యజీవితంలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు కొనసాగించారని అన్నారు. ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యుడిగా ఉండి సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి చట్టసభల్లో పేదల గొంతుకగా మారి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. కమ్యూనిస్టు కార్యకర్తలకు, నేతలకు సుందరయ్య చుక్కాని లాంటివారని అన్నారు. దేశ పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేస్తూ అందుకు అనుగుణంగా ఉద్యమ రీతులను మార్చుకుంటూ చివరివరకు ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని అన్నారు. జ్యోతి ఆస్పత్రి వైద్యుడు మువ్వా రామారావు మాట్లాడుతూ, కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు ముఖ్యం కాదని ప్రజలే ఎజెండాగా పనిచేయాలన్నారు. ఆకలి, పేదరికం ఉన్నంతవరకు కమ్యూనిజం బతికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీశ్ చంద్ర, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, రవినాయక్, తిరుపతి రాంమూర్తి, వరలక్ష్మి, పాదూరి శశిధర్ రెడ్డి, రెమిడాల పరుశరాములు, గోవర్ధనా, ఆయూబ్, చౌదరి సీతారాములు, వినోద్‌నాయక్, వాడపల్లి రమేశ్, ఊర్మిల, సైదమ్మ, పిల్లుట్ల సైదులు, రామారావు, సైదులు, వెంకట్‌రెడ్డి, అంజద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల

ప్రాజెక్టులకు మోక్షం

- త్వరలో టెండర్లు నిర్వహించేందుకు సన్నాహాలు
- కొనసాగుతున్న భూపరిహారం, పునరావాసం ప్రక్రియ

7

పేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), మే 19 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాజకీయాలకు అతీతంగా ప్రజల పక్షాన నిలుస్తానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిలకాపురం గ్రామంలో మూడున్నర ఎకరాల్లో అర్హులైన 121 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హోంమంత్రిగా పనిచేసే కాలంలో జానారెడ్డి ఈ ప్రాంత పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలాలు లేవని గుర్తించారని, అందుకే పలు గ్రామాల్లో ప్రభుత్వ పట్టా భూములు సేకరించేందుకు కృషి చేశానన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో ఆ స్థలాలను పేదలకు పంపిణీ చేయడంలో బీఆర్ఎస్ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. మళ్లీ తామే ప్రస్తుతం ఆ స్థలాలను రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో బోయగూడెం, రాజవరం, కొంపల్లి గ్రామాల్లో కూడా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీచేసి న్యాయం చేస్తామన్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కుందూరు జానారెడ్డికే దక్కుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, నాయకులు మాటలు చెప్పారేగాని చేతలు చేయలేదని, పేదల కోసం ఒక్క ఇల్లు కట్టిన దాఖలాలు లేవని విమర్శించారు. సాగర్ ఉప ఎన్నికలో పెండింగ్‌లో ఉన్న భూములకు పట్టా పాస్ పుస్తకాలు ఇస్తామని, నెల్లికల్ లిఫ్టును పూర్తి చేస్తామని హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెవెన్యూ పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు, నెల్లికల్ లిఫ్టు పనులు కొనసాగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణానాయక్, నాయకులు శాగం రాఘవరెడ్డి, కట్టెబోయిన అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లుగౌడ్, గాలి చంద్రకళ, లాలునాయక్, అనుముల అంజి, మెరావత్ మునినాయక్, తదితరులు పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి ఉత్సవాలు

నల్లగొండ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్తీలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 22వ తేదీన హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బైరగోని రాజయ్య, బండారు ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాలను అన్ని హంగులతో తీర్చిదిద్దామని, భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకాలు, మండపారాధన, మహాస్నపన, 10 గంటలకు హోమం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం స్వామివారిని పురవీధుల గుండా హనుమాన్ పల్లకి సేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు పంచామృతాలతో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సురిగి యాదగిరి, కాశమ్మ, వెంకన్న, శేఖర్, శంకర్, శ్రీను, మధు, సురేష్, కోటి, దిలీప్, లింగస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజయ్య

దాతల ఔదార్యం

● నిరుపేదకు ఇల్లు నిర్మించిన రాజాపేట గ్రామస్థులు
● మూడేళ్లు బాత్రూంలోనే గడిచిన బాలనర్సమ్మ
● చలించిన స్థానికులు, ముందుకు వచ్చిన దాతలు


బాలనర్సమ్మకు రాజపేట గ్రామస్థులు నిర్మించి ఇచ్చిన ఇల్లు


ఇల్లు నిర్మాణానికి ముందు బాలనర్సమ్మ ఉన్న బాత్రూం

(ఆంధ్రజ్యోతి-రాజాపేట)

యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రానికి చెందిన సిరిపంగ బాలనర్సమ్మ, శివయ్య లది నిరుపేద కుటుంబం. రెక్కాడితే కాని డొక్కాడని జీవితాలు. వారికి ఒక కుమార్తె. పదేళ్ల కిందట శివయ్య పదేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి నాలుగిళ్లలో కూలీనాలీ చేస్తూ జీవితాన్ని వెళ్లదీస్తోంది. కుమార్తె ఝాన్సీకి వివాహం చేయడంతో ఒంటరిగా ఉంటోంది. 1970లో 25 గజాల స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా అందులో పెంకుటిళ్లు నిర్మించారు. ఆ ఇంట్లోనే జీవితాన్ని గడిపి బాలనర్సమ్మ కొద్దికాలం తర్వాత ఇల్లు శిథిలావస్థకు చేరింది. గతంలో స్వచ్ఛభారత్ కింద బాత్రూంను నిర్మించుకున్నారు. ఇళ్ల శిథిలావస్థకు చేరడంతో ఆ బాత్రూమే వారికి నివాసమైంది. కాళ్లు చాపి పడుకునేంత స్థలం కూడా లేని బాత్రూం లోనే మూడేళ్ళుగా గడుపుతోంది.

గత ఎన్నికల సమయంలో కొంతమంది యువకులు ప్రచారాన్ని నిర్వహిస్తుండగా బాత్రూంలో జీవితం గడుపుతున్న బాలనర్సమ్మ జీవితం వెలుగులోకి వచ్చింది. వెంటనే పలు పార్టీల నాయకులు సందర్శించారు. దుర్భర జీవితాన్ని గడుపుతున్న బాలనర్సమ్మకు మేమున్నామంటూ దాతలు, గ్రామస్థులు భరోసా కల్పించారు. చేయిచేయి కలిపి తలా కొంత సొమ్మును పోగుచేశారు. ఇంటి నిర్మాణానికి ఉపక్రమించారు. కొంతమంది డబ్బులతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సిమెంట్, రేకులు, ఇటుకలు అందజేశారు. సుమారు లక్షన్నర రూపాయలతో ఒక గది, వరండాతో ఇంటిని నిర్మించారు. విద్యుత్ సౌకర్యంతో పాటు పలు సదుపాయాలను కల్పించారు. వయస్సు మీద పడిన బాలనర్సమ్మకు సొంతింటి కలను నిజం చేసి అప్పగించారు. నాలుగు కిందట ఆమె నూతన గృహ ప్రవేశం చేసింది. సొంతింటి కల నెరవేరడంతో ఆమె కళ్లలో ఆనందం కనిపిస్తోంది. పేదింటిరాలికి గూడును కల్పించిన గ్రామస్థుల ఔదార్యం, మానవత్వం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

అందరికీ రుణపడి ఉన్నా: సిరిపంగ బాల నర్సమ్మ



నేను ఉండే ఇళ్ల శిథిలావస్థకు చేరింది. నాకు నిలువ నీడ కరువైంది. మూడేళ్ల బాత్రూంలోనే కాలం వెళ్లదీ. నా కష్టాన్ని చూసి గ్రామస్థులు, దాతలు సహకరించి ఇల్లును నిర్మించారు. దాతలందరికీ రుణపడి ఉంటా.

పట్టుదలకు.. సరస్వతీ ప్రసన్నం

» పేదింట విరిసిన విద్యాకుసుమం
» తల్లిదండ్రుల మృతితో నానమ్మ సంరక్షణలో ప్రసన్న
» మొదటిర్యాంక్ వస్తే విమానం ఎక్కిస్తానన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి
» ప్రేరణగా తీసుకుని సాధించిన ప్రసన్న
» ఎస్‌వోతో కలిసి వైజాగ్‌లో మూడు రోజుల పర్యటన



విశాఖపట్టణంలోని పలు ప్రదేశాలను తిలకిస్తున్న విద్యార్థిని ప్రసన్న.

పట్టుదలకు మారుపేరుగా నిలుస్తోంది పుట్టల ప్రసన్న. తల్లిదండ్రులు చిన్నతనంలోనే దూరమైనా నానమ్మ సంరక్షణలో పెరిగి దీక్షగా చదివింది. నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇచ్చిన స్ఫూర్తితో హాస్టల్‌లో అదనంగా గంట పాటు చదివి అందరి కంటే చివరగా నిద్రపోయేది. కృషికి తగ్గట్టుగా 600లకు 563 మార్కులు(10జీపీఏ) సాధించి నల్లగొండ జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల్లో టాపర్‌గా నిలిచింది. కలెక్టర్ అన్ని ఖర్చులు భరించి విమానంలో విహారయాత్రకు పంపించారు. విశాఖపట్నంలో పర్యటించి సోమవారం స్వగ్రామానికి తిరిగి వచ్చిన ఆమె ఆంధ్రజ్యోతితో ముచ్చటించింది. డాక్టరై పేదలకు సేవ చేస్తానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసింది.

- (ఆంధ్రజ్యోతి-మాడ్గులపల్లి)



విమానంలో విహారయాత్రకు...

నల్లగొండ జిల్లా స్థాయి కేజీబీవీల్లో మొదటి ర్యాంక్ సాధించిన ప్రసన్న విషయం తెలుసుకున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి బాలికతో పాటు ఆమె విజయానికి కృషి చేసిన కేజీబీవీ ఎస్‌వో సునీతను తన కార్యాలయానికి పిలిపించుకుని అభినందించారు. తాను ఇచ్చిన హామీ ప్రకారం ఉత్తమ మార్కులు సాధించిన ప్రసన్నతో పాటు ఎస్‌వో సునీతను సొంత ఖర్చులతో విమానంలో విశాఖపట్టణం వెళ్లేందుకుగాను విమాన టికెట్లను అందించారు. దీంతో ప్రసన్న, సునీతలు ఈ నెల 17న విశాఖపట్టణానికి వెళ్లి మూడు రోజులపాటు అక్కడ జూ పార్క్, కైలసగిరి, రుషికొండ, సబ్‌మరైన్ బీచ్‌తోపాటు పలు అందమైన ప్రదేశాలను తిలకించి ఆహ్లాదాన్ని పొందారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలకేంద్రానికి చెందిన పుట్టల గాబ్రియేల్, శైలజ దంపతులకు ఇద్దరు సంతానం ప్రసన్న, ప్రమోద్‌లు. కూలీనాలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. 2014 గాబ్రియేల్, 2015లో శైలజ అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటికి ప్రసన్న వయస్సు ఐదేళ్లు కాగా ప్రమోద్ వయస్సు మూడేళ్లు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే దూరంకావడంతో నానమ్మ సుశీల సంరక్షణలో పెరిగారు. ఆమె కూలీనాలి చేస్తూ వారిని పోషిస్తోంది. తన ప్రతిభతో ప్రసన్న గురుకులంలో సీటు సాధించింది. తల్లిదండ్రులు తమను బాగా చదివించాలని అనుకునేవారని నానమ్మ ద్వారా తెలుసుకున్నారు. కష్టపడి చదువుతూ ప్రతీ తరగతిలో ఉత్తమ మార్కులు సాధిస్తూ వస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు వేములపల్లిలోని రవీంద్రభారతి పాఠశాలలో, 6వ తరగతి మోడల్ స్కూల్‌లో చదివింది. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మాడ్గులపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యనభ్యసించింది. తమ్ముడు ప్రమోద్ ప్రస్తుతం 9వ తరగతి వేములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. ధైర్యాన్ని కోల్పోకుండా తల్లిదండ్రుల కలలను నెరవేర్చేందుకు చిన్నతనం నుంచి చదువులో ముందుంటున్నారు. సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి నిలపుతున్నారు.

ప్రసన్నే స్ఫూర్తి....

నానమ్మ ఒడిలో పెరిగిన ఆ ప్రసన్న తన కష్టాలను అధిగమించి చదువుపైనే దృష్టిని కేంద్రీకరించి ఉత్తమ ఫలితాలను సాధించింది. ప్రసన్నను ఆదర్శంగా తీసుకుని గురుకులంలోని విద్యార్థినులు తాము కూడా కష్టపడి చదివి అనుకున్నది సాధిస్తామంటున్నారు. ప్రసన్న కష్టించిన తీరు మాకు ఆదర్శంగా నిలుస్తుందంటున్నారు.



ప్రేరణ కల్పించిన కలెక్టర్ హామీ

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా వ్యాప్తంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల సందర్శనలో భాగంగా మాడ్గులపల్లి కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఆ సందర్భంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను విశాఖపట్టణంకు సొంత ఖర్చులతో విమానం ఎక్కించి అక్కడ అయ్యే ఖర్చులను సైతం తానే భరిస్తానని తెలిపారు. కలెక్టర్ మాటలతో ప్రసన్న ప్రేరణ పొందింది. ప్రతీ రోజూ అందరి కంటే ఒక గంట ఎక్కువగా (రాత్రి 11 గంటల వరకు) చదివి నిద్రపోయేది. అందరితో పాటే ఉదయం 4.30 గంటలకే నిద్రలేచేది. ప్రతీ పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా చదవడం, అర్థం చేసుకోవడం కోసం మరింత శ్రమించింది. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో కష్టపడి చదివి పరీక్షలు రాసింది. పదవ తరగతిలో 563 మార్కులు(10జీపీఏ) సాధించి నల్లగొండ జిల్లా స్థాయి కేజీబీవీలో మొదటి ర్యాంక్ సాధించింది.

డాక్టర్ అయి పేదలకు సేవచేస్తా



కలెక్టర్ ఇచ్చిన ప్రేరణతో కష్టపడి చదివి పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించా. కలెక్టర్ మేడం సొంత ఖర్చులతో నన్ను, ఎస్‌వో మేడం సునీతను విశాఖపట్టణం పంపించారు. అక్కడ మేము పలు అందమైన ప్రదేశాలను చూశాం. తల్లిదండ్రులను కోల్పోయినప్పటికీ నానమ్మ సంరక్షణలో పెరిగి కష్టపడి చదివి మంచి మార్కులు సాధించా. చదువుకు పేదరికం అడ్డు కాదు. భవిష్యత్‌లో మెడిసిన్ చదివి డాక్టర్ అయి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తా.

- పుట్టల ప్రసన్న, విద్యార్థిని

మా విద్యార్థిని చూసి సంతోషంగా ఉంది



పదవ తరగతి ఫలితాల్లో మా పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రసన్న ఉత్తమ మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎక్కువ మార్కులు వచ్చిన వారిని సొంత ఖర్చులతో విశాఖపట్టణం పంపిస్తానని చెప్పగా అందుకు ప్రసన్న ఎంపిక కావడం ఆనందంగా ఉంది. విశాఖపట్టణంలో పలు ప్రదేశాలను తిరిగి చూశాం. కలెక్టర్ హామీ మరెంతో మంది పేద విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుంది.

- సునీత, మాడ్గులపల్లి కేజీబీవీ, ఎస్‌వో

అన్నీ తానై చూసుకుంటున్నా



నా కొడుకు, కోడలు అనారోగ్యంతో చనిపోయారు. దీంతో వారి పిల్లలు ప్రసన్న, ప్రమోద్ బాగోగులు నాన్నమ్మగా అన్ని నేనే చూసుకుంటూ చదివిస్తున్నా. నా మనుమరాలు ప్రసన్న మొదటి నుంచి చదువులో ముందుంటుంది. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించడంతో కలెక్టర్ నా మనుమరాలిని విమానంలో విశాఖపట్టణానికి పంపించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం నా మనుమరాలి, మనుమడి చదువుకు సహాయ, సహకారాలు అందించాలి.

- సుశీల, ప్రసన్న నానమ్మ



ఫాస్టాగ్ మెసేజ్‌తో చోరీ వెలుగులోకి


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

బీబీనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఫాస్టాగ్ మెసేజ్ ఓ యజమాని ఇంటి చోరీని వెలుగులోకి తెచ్చింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో సోమవారం ఉదయం వెలుగుచూసింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బీబీనగర్ పట్టణంలోని గోకుల్‌నగర్ కాలనీలో నివాసముంటున్న వారాల ఆంజనేయులు కుటుంబం శనివారం సాయంత్రం ఇంటికి తాళాలు వేసి మహదేవ్‌పూర్ గ్రామంలో ఆయన బావమరిది గృహ ప్రవేశ కార్యక్రమానికి వెళ్లారు. ఆదివారం కూడా అక్కడే ఉండిపోయారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దాటాక ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. నగదు, నగల కోసం ఇంట్లోని వస్తువులన్నీ వెతికారు. ఈ క్రమంలో రూ.లక్ష నగదుతో పాటు కారు తాళాలు దొంగలకు లభ్యమయ్యాయి. దీంతో ఇంటి పక్కన పార్క్ చేసి ఉంచిన కారును అపహరించుకుపోయారు. కాగా సోమవారం తెల్లవారుజామున మిర్యాలగూడ టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్ ద్వారా టోల్ రుసుం డబ్బులు కట్ అయినట్లు ఇంటి యజమాని కుమారుడి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దాంతో కంగారుపడిన ఇంటి యజమాని ఇంటి పక్కన వ్యక్తికి ఫోన్ చేసి పార్క్ చేసి ఉంచిన కారు గురించి వాకబ్‌చేశాడు. కారు లేదని సమాధానం రావడంతో పాటు ఇంటికి వేసిన తాళాలు కూడా పగులగొట్టి ఉన్నాయని చెప్పడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులతో కలిసి హుటాహుటిన బీబీనగర్‌లోని తన ఇంటికి తిరిగి వచ్చాడు. పరిశీలించగా రూ.లక్ష నగదు పోయినట్టు గుర్తించారు. ఈ ఘటనపై ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మిర్యాలగూడ టోల్‌ప్లాజాలో రికార్డు అయిన కారు విజువల్ ఆధారంగా కేసును చేధించేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

భువనగిరిలో పట్టపగలు చోరీ

భువనగిరి టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో సోమవారం మధ్యాహ్నం తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక వసుంధర థియేటర్ ఎదురుగా ఉండే ఆమిల్ రాకేష్ సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇదే అదనుగా గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాలు పగులకొట్టి లోనికి ప్రవేశించి ఇంట్లోని రూ.2.60 లక్షల నగదు, తులం బంగారం ఆభరణాలు దోచుకెళ్లారు. అయితే గేటు, ఇంటి దర్వాజా తీసి ఉండటాన్ని గమనించిన పొరుగింటి వారు లోనికి వెళ్లి చూడగా కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడం, బీరువాలు తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గ్రహించి రాకేష్‌కు, పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించారు. రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి: బాలుడిపై పోక్సో కేసు నమోదు

మోత్కూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. తమ కుమార్తెపై బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.నాగరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. బాలుడు లైంగిక దాడికి పాల్పడటంతో పాటు ఆమెను వేధిస్తున్నాడని బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ చేయగా, వాస్తవమని తేలడంతో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి, బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్టు ఆయన చెప్పారు.

చక్రయ్య హత్య కేసు నిందితులపై పీడీయాక్ట్ నమోదు

నూతనకల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామ మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య హత్య కేసు నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తుంగతుర్తి సీఐ నర్సింహారావు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చక్రయ్య హత్య కేసులో ప్రధాన నిందితులు చక్రయ్య అల్లుడు కనకటి వెంకన్న అలియాస్ వెంకటేశ్వర్లు, మనువడు (కుమార్తె కుమారుడు) కనకటి శ్రవణ్‌లపై గతంలో అనేక క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో ఇలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండడం కోసం ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి చంచల్‌గూడ జైల్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించినా, ప్రజాశాంతికి భంగం కలిగించినా ప్రతి ఒక్కరిపై ఇలాంటి చర్యలు తీసుకుంటామన్నారు.


నిందితులు కనకటి శ్రవణ్, వెంకన్నలను చంచల్‌గూడ జైల్‌కు తరలిస్తున్న పోలీసులు

జైలులో సహవాసం.. ఒంటరి మహిళలే లక్ష్యం



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ, మే 19 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లినా వారి బుద్ధిమారలేదు. అక్కడే ఉన్న మరో ముగ్గురితో కలిసి ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీన నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో వృద్ధ మహిళ లక్ష్మమ్మపై దాడి చేసి పుస్తెలతాడు చోరీ చేశారు. కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు నిందితుల్లో ముగ్గురిని 24 గంటల్లో పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా కేంద్రంలో డీఎస్పీ కే శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం 2.30గంటలకు నకిరేకల్ పట్టణం వీటికాలనీలో నివాసముంటున్న నాగులవంచ లక్ష్మమ్మ వృద్ధురాలి ఇంటికి ముగ్గురు అద్దెకు ఇల్లు కావాలని అడిగారు. మాటల్లో పెట్టి మంచినీటిని అడగ్గా ఆమె తీసుకు రావడానికి వెళ్తుండగా వెనక నుంచి దాడి చేశారు. ఒక దుప్పటిని చింపి ఆమె మూతిని కాళ్లు, చేతులు కట్టేసి ఆమె ముఖంపై పిడిగుద్దులతో దాడిచేశారు. అనంతరం ఆమెను కొట్టి ఒంటి మీద ఉన్న మూడున్నర తులాల పుస్తెలతాడు, నాలుగు రోల్ గోల్డ్ గాజులను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు.

24 గంటల్లోనే..

చోరీ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు మూడు ప్రత్యేక బృందాలతో పలు ప్రాంతాల్లో నేరస్థుల కోసం తనిఖీలు నిర్వహించినట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీ సాయంత్రం తిప్పర్తి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద హోండా యాక్టివా మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించారని తెలిపారు. దీనితో అనుమానం వచ్చి వెంటాడి పట్టుకోగా వారి వద్ద ఒక పుస్తెలతాడు లభించిందన్నారు. అనంతరం విచారణలో సదరు వ్యక్తులు ఈ నెల 17న నకిరేకల్‌లోని వృద్ధురాలు లక్ష్మమ్మ ఇంటికి వెళ్లి దాడి చేసినట్లు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో నకిరేకల్‌కు చెందిన మల్లం నర్సింహ పరారీలో ఉండగా, హైదరాబాద్‌కు చెందిన సత్యరామకృష్ణ, అదేవిధంగా మామిడి బాలకృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా ఉట్కూర్ మండలానికి చెందిన ముష్టి వెంకటేశ్వర్లును అరెస్టు చేశామన్నారు. సదరు నేరస్తులు రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ పలు దొంగతనం కేసుల్లో ఉన్నారన్నారు. వీరందరికి చంచల్‌గూడ జైలులో ఉన్నప్పుడు పరిచయం ఏర్పడిందన్నారు. ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడాలని నిర్ణయించుకున్నారని డీఎస్పీ తెలిపారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. దొంగతనం కేసును 24 గంటోల్లో చేధించి నేరస్తులను పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు కేసును చేధించడంలో తన పర్యవేక్షణలో పాల్గొన్న నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐలు లచ్చిరెడ్డి, సైదులు, సాయి ప్రశాంత్, సిబ్బంది వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ శ్రీనివాస్, రమేష్, సునీల్, రవి, ఫ్రింగర్ ప్రింట్స్ ఎస్ఐ శివ, కానిస్టేబుల్ నర్సింహా, హెచ్‌జీ నర్సిరెడ్డిలను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నూతనకల్, మే 19(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం తాళ్లసింగారం గ్రామంలో సోమవారం జరిగింది. బాధిత రైతు జటంగి ముత్తిలింగం తన ఎడ్లను మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర వైరుకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిందని రైతు తెలిపారు. దీంతో సుమారు రూ.75వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం

మాడ్గులపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలోని చుట్టుపక్కల ఇళ్లలో సోమవారం ఉదయం 5.30 గంటలకు షార్ట్‌సర్క్యూట్‌తో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సబ్‌స్టేషన్‌లో పేలుడు శబ్దం వచ్చిన సమయంలోనే ఇళ్లలోని ఫ్యాన్లు, టీవీలు, బోర్డులు, విద్యుత్ వైర్లు కాలిపోయాయని అన్నారు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఇలా జరుగుతున్నా పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. బాధితుల ఇళ్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. సమస్యను పరిష్కరించి, ఎలక్ట్రానిక్ పరికరాల నష్టాన్ని అంచనా వేసి బాధితులకు అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

బీభత్సం సృష్టించిన కారు

● అతివేగంగా ఢీకొనడంతో వ్యక్తి మృతి
● దెబ్బతిన్న పార్క్ చేసిన కారు, బైక్‌లు



ప్రమాదానికి కారణమైన కారు, మృతుడు సునీల్(ఫైల్‌ఫొటో)

నార్కట్‌పల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం వద్ద సోమవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగం, అజాగ్రత్తతో వచ్చిన వాహనం ఓ స్కూటరిస్టును ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అంతటితో ఆగకుండా రోడ్డు పక్కనే మాజీ వైస్‌ఎంపీపీ దివంగత కల్లూరి యాదగిరి ఇంటి సమీపంలో పార్క్ చేసి ఉన్న కారు, బుల్లెట్, మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో అవి ధ్వంసమయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించి గ్రామస్థుల ద్వారా తెలిసిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు నుంచి హైదరాబాద్‌కు ముగ్గురితో టీఎస్11 ఈజీ-5679 నెంబర్ గల కారు అతివేగంగా వస్తూ నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలోని హెరిటేజ్ పార్లర్ వద్దకు చేరుకుని అదే దారిలో స్కూటీపై వెళ్తున్న నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి సునీల్(33)ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై సునీల్ అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా సునీల్ నాలుగు నెలల క్రితమే ప్రేమ వివాహం చేసుకుని ప్రైవేట్ జాబ్ చేస్తూ నల్లగొండలో నివాసముంటున్నాడు. తన స్నేహితుడికి చెందిన యాక్టివాను తీసుకుని రేషన్ బియ్యం తెచ్చేందుకు వస్తున్న సునీల్ కారు ఢీకొట్టిన ఘటనలో దుర్మరణం చెందాడు. కాగా పార్క్ చేసిన కారును వెనుక నుంచి ఢీకొట్టగా అది రోడ్డుపై పల్టీ కొట్టింది. దీంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. కారు అత్యంత వేగంతో వచ్చినట్టు స్థానికులు తెలిపారు. కాగా ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ ఘటనా స్థలికి వెళ్లి గాయపడిన కారు డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిని చికిత్సనిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి సునీల్ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.


కారు ఢీకొనడంతో పల్టీకొట్టిన కారు

ట్రాక్టర్ బోల్తా: మహిళ


పద్మ(ఫైల్‌ఫొటో)

మోటకొండూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లిలోని బ్రిడ్జి వద్ద ఓ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఎస్ఐ నాగుల ఉపేందర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పీట్ల నర్సయ్య అతడి భార్య పీట్ల పద్మ(43)తో కలిసి సోమవారం నాంచారిపేట నుంచి ట్రాక్టరులో గనేట్‌రాయిని నింపుకుని కాటేపల్లిలో ఖాళీ చేసి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో కాటేపల్లి బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి ట్రాక్టర్ పల్టీ కొట్టింది. పద్మపై ట్రాలీ పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందులో కుమార్తెకు వివాహం జరిగింది. పద్మ కుమారుడు మత్యగిరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు


అజయ్ మృతదేహం

వలిగొండ, మే 19 (ఆంధ్రజ్యోతి) : బైక్ పైనుంచి పడి యువకుడు మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల మండలం వెలిమినేటి గ్రామానికి చెందిన అంతటి అజయ్‌కుమార్(26) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం తల్లి పద్మతో కలిసి వలిగొండ మండలం పొద్దటూరు గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చారు. శుభకార్యం ముగిసిన అనంతరం బంధువు భానుచందర్ బైక్ తీసుకుని అదేరోజు రాత్రి ఉద్యోగానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఎదుల్లగూడెం పరిధిలో అతివేగంగా అదుపు తప్పి కాల్వలో పడిపోయాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వడదెబ్బతో గొర్రెలకాపరి...


నగేష్(ఫైల్‌ఫొటో)

హుజూర్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పొదిల నగేష్(45) సోమవారం చికిత్సపొందుతూ మృతి చెందారు. 10 రోజుల కిందట వడదెబ్బకు అస్వస్థతకు గురి కాగా పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రెండురోజుల చికిత్స అనంతరం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు వివాహం కాలేదు.

తల్లిదండ్రుల వద్ద ఉంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. నగేష్ మృతికి పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు సంతాపం తెలిపారు.

ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల..

ప్రాజెక్టులకు మోక్షం



పెండ్లిపాకల ప్రాజెక్టు

- త్వరలో టెండర్లు నిర్వహించేందుకు సన్నాహాలు
- కొనసాగుతున్న భూపరిహారం, పునరావాసం ప్రక్రియ

దేవరకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల ప్రాజెక్టుల ఎత్తు పెంపు పనులకు మోక్షం లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకొండ ప్రాంతంలోని ఎస్ఎల్‌బీసీ, డిండి, శ్రీశైలం సొరంగమార్గం, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల ఎత్తు పెంపు పనులను త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. దీంతో పాటు పెండ్లిపాకల ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న భూనిర్వాసితులకు పునరావాసం, భూపరిహారం ప్రక్రియ వేగవంతంగా చేపట్టింది. త్వరలో టెండర్లు పిలిచి పనులు పునఃప్రారంభించనున్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. 2015లో రూ.543 కోట్ల వ్యయంతో అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టు పనులను ప్రారంభించింది. 30 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. కానీ కాంట్రాక్టర్ పనులు నిర్వహించకపోవడంతో కొన్నేళ్లుగా ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేపట్టింది. శ్రీశైలం నుంచి వచ్చే కృష్ణాజలాలు నాగర్‌కర్నూల్ జిల్లా మన్నెవారిపల్లి వద్ద టన్నెల్ 1 అవుట్‌లెట్ నుంచి నక్కలగండి రిజర్వాయర్‌కు చేరుతాయి. అక్కడి నుంచి ఓపెన్‌కెనాల్ ద్వారా తెల్‌దేవరపల్లి సమీపంలోని టన్నెల్ 2 ఇన్‌లెట్‌కు నీరు వెళతాయి. అక్కడి నుంచి నేరేడుగొమ్ము మండలం టన్నెల్ 2 అవుట్‌లెట్ ఓపెన్‌కెనాల్ ద్వారా పెండ్లిపాకల ప్రాజెక్టుకు నీరు చేరుతుంది. పెండ్లిపాకల ప్రాజెక్టు నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ ప్రధానకాల్వకు నీరు వెళ్తుంది. అయితే టన్నెల్ 2 అవుట్‌లెట్ నుంచి పెండ్లిపాకల వరకు నాలుగు కిలోమీటర్లు, పెండ్లిపాకల అక్కంపల్లి రిజర్వాయర్ వరకు 18 కిలోమీటర్ల మేర ఓపెన్‌కెనాల్ తవ్వాల్సి ఉంది. దీంతో పాటు ప్రస్తుతం ఉన్న పెండ్లిపాకల ప్రాజెక్టు సామర్థ్యం 0.6 ఉండగా దాన్ని 2.2 టీఎంసీలు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. పెండ్లిపాకల ప్రాజెక్టు సామర్థ్యం పెంచితే దేవరకొండ మండలంలోని మైనంపల్లి ఉప్పువాగు వర్షపు నీరు కూడా పెండ్లిపాకల ప్రాజెక్టులోకి చేరుతుంది. పెండ్లిపాకల ప్రాజెక్టు సామర్థ్యం పెంచితే కొండమల్లేపల్లి మండలం కారోబార్‌తండా, గుడితండా, కరియాతండా, కారోబార్‌తండాలు ముంపునకు గురికానున్నాయి. నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారులు ఇప్పటికే సర్వే నిర్వహించారు. ప్రాజెక్టు కింద 2700 ఎకరాల వరకు భూములు కోల్పోతుండగా 1800 ఎకరాల వరకు రైతులకు భూపరిహారం చెల్లించారు. మిగతా ముంపునకు గురవుతున్న భూములకు కూడా భూపరిహారం చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు పునరావాసం కల్పించేందుకు చింతపల్లి మండలం నసర్లపల్లి, కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి వద్ద భూములు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ ప్రారంభం అవుతుండటంతో పునరావాసం ప్రక్రియ వేగవంతం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం...

ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచే పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుంది. ప్రాజెక్టు కింద భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు భూపరిహారం, పునరావాసం ప్రక్రియ కొనసాగుతుంది. త్వరలో ప్రాజెక్టు పనులు పున ప్రారంభంకానున్నాయి.

- నెహ్రూ, పెండ్లిపాకల ప్రాజెక్టు ఈఈ



సాగర్ లైనింగ్ పనులు ..

సకాలంలో పూర్తయ్యేనా!

- సూర్యాపేట జిల్లాలో సాగర్ ఎడమ కాల్వ 59కి.మీ
- 74కి.మీ దోసపాడు నుంచి 133కి.మీలు రామచంద్రపురం వరకు
- లైనింగ్ పనులకు ప్రభుత్వం రూ.29కోట్లు విడుదల

కోదాడ, మే 19 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమ కాలువ లైనింగ్(కోతకు గురైన)పనులు, వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నల్లగొండ నుంచి సూర్యాపేట మీదుగా ఖమ్మం జిల్లా వరకు 178కి.మీ పొడవున సాగర్ ఎడమ కాలువ ఉంది. ప్రతి సంవత్సరం కాలువ లైనింగ్ ఏదో చోట దెబ్బతింటూనే ఉంది. కొన్ని చోట్ల అనుకోకుండా కాలువకు గండిపడటం సాధారణంగా మారింది. ఈ నేపథ్యంలో వర్షకాలానికి ముందే వేసవిలో లైనింగ్ దెబ్బతిన్న చోట మరమ్మతులు చేపడితే, తమకు ఇబ్బంది ఉండదని, పంట నష్టం జరగదని రైతులు చెబుతున్నారు. గత సంవత్సరం సెప్టెంబరులో కురిసిన భారీ వర్షానికి నడిగూడెం మండలం కాగితరామచంద్రపురం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రంగుల వంతెన వద్ద 50నుంచి70 మీటర్ల పొడవునా కాలువ కట్ట కొట్టుకుపోయింది. దీంతో నడిగూడెం, అనంతగిరి, ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలోని 100 ఎకరాల్లో పంట దెబ్బతింది.. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కాలువ గండి పూడ్చివేత పనులు చేపట్టాల్సి వచ్చింది. కాలువ దెబ్బతిన్న చోట లైనింగ్ పనులు చేపట్టకపోవటం, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్రతి సంవత్సరం కాలువ గండిపడి, రైతులు నష్టపోతున్నారని, విపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించాయి. దీంతో ఈ సంవత్సరం ప్రభుత్వం సూర్యాపేట జిల్లా పెన్‌పహెడ్ మండలం దోసపాడు సాగర్‌కాలువ 74కి.మీ నుంచి 133కి.మీ. వరకు లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. కాగా, 74కి.మీ నుంచి 102కి.మీ వరకు లైనింగ్ పనుల కోసం ప్రభుత్వం రూ.29కోట్లు విడుదల చేసినట్లు సమాచారం. నేటికీ ఈ లైనింగ్ పనులు ప్రారంభం కానందున రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ నుంచి వర్షాలు పడటంతో పాటు పనులకు ఆటంకం ఉంటుందని, కాలువకు నీటి విడదలైతే పనులు ముందుకు నడవని రైతులు తెలిపారు. వర్షాలు కురవక ముందు, సాగర్ నీటి విడుదల జూన్‌కు ముందే లైనింగ్(కోతకు గురైన చోట) పనులు పూర్తి చేసి, గండ్లు పడకుండా చూడాలని, పంట నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని, ఆయకట్టు రైతులు మంత్రి ఉత్తమ్‌ని కోరుతున్నారు.

రంగుల వంతెనకు గండిపడటంతో వందల ఎకరాల్లో పంట నష్టం

పాలేరు వెనుక జలాల కారణంగా గత సంవత్సరం సెప్టెంబరులో నడిగూడెం మండలం కాగితరామచంద్రపురం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రంగులవంతెన వద్ద గండ్లు పడ్డాయి. 50నుంచి70మీటర్ల పొడవునే కాలువ కట్ట కొట్టుకుపోయింది.

పాలేరు వాగు నీటితోపాటు, సాగర్ వాటర్ కలువటంతో నడిగూడెం మండలం కాగితరామచంద్రపురం, వల్లాపురం, అనంతగిరి మండలం చనుపల్లి, పాలారం, కిష్టాపురం, కొత్తగూడెం, గోండ్రియాల, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని మందడి నర్సయ్యగూడెం, చీతిలి తండా, రాజుపేట, ఈశ్వరమాదారం గ్రామాలను నీరు ముంచెత్తింది. దీంతో వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అంతేకాక గతంలో నిడమనూరు మండలం ముప్పారం వద్ద ఎడమ కాలువకు గండిపడటంతో, వందల ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో రైతులకు నష్టాలు వచ్చాయి. మరమ్మతులు పూర్తయ్యే వరకు నీటికోసం సుమారు 25రోజుల పాటు నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల రైతులు ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో సాగర్‌కు నీరు వదలటానికి ముందే లైనింగ్ పనులు పూర్తి చేసి, పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎవరో వస్తారని ఎదురుచూడకుండా..



తూముకు మరమ్మతులు చేస్తున్న రైతులు

భువనగిరి రూరల్, మే19(ఆంధ్రజ్యోతి): వచ్చే వానాకాలంలో ధ్వంసమైన చెరువు తూమునుంచి నీరు వృథా కాకుండా రైతులు శ్రమదానం చేపట్టి తాత్కాలికంగా తూము నిర్మాణం చేసుకున్నారు. భువనగిరి మండలం సిరివేణికుంట గ్రామ పంచాయతీ పరిధిలో బొల్లేపల్లి చెరువు విస్తరించి ఉంది. అయితే గత మూడు నెలల క్రితం చెరువు తూముకు ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు, ఇనుప రేకును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకునిపోయారు.ఈ విషయమై ఇరిగేషన్ (నీటిపారుదల) అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు పట్టించుకోలేదు. శామీర్‌పేట వాగు నుంచి చీకటిమామిడి, వడపర్తి, రావిపహాడ్, అనాజీపురం, మీదుగా బొల్లేపల్లి చెరువులోకి రాచకాల్వ ద్వారా బొల్లేపల్లి చెరువులోకి నీరు చేరుతుంది. అయితే నీటి వృథా కాకుండా ముందస్తుగా సిరివేణికుంట గ్రామానికి చెందిన రైతులు బొర్ర ప్రభాకర్, భిక్షపతి, నవీన్, ప్రవీణ్, సిద్దయ్య, కృష్ణమూర్తి, సత్యనారాయణలు సమిష్టిగా శ్రమించి రాళ్లు, కాంక్రీట్, ఇనుప చువ్వలు, సిమెంట్ సమకూర్చి తాత్కాలికంగా తూం గోడను నిర్మించుకున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చెరువు తూమును సందర్శించి శాశ్వతంగా తూము నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఈ నాలుగు ఎకరాలు నావి కావు

● రికార్డులో ఉండి, వాస్తవంలో లేని భూమిని స్వచ్ఛందంగా తొలగించుకున్న రైతు



రైతు వెంకన్నను సన్మానిస్తున్న తహసీల్దార్ ఉపేందర్, రెవెన్యూ సిబ్బంది

మోత్కూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): భూమి లేకపోయినా ఎందరికో ధరణిలో పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చాయి. తమకు వచ్చిన పాసుపుస్తకాల ఆధారంగా లేని భూమి కోసం కొట్లాడుతున్న ఈ రోజుల్లో తనకు లేని భూమి తన రికార్డుల్లోంచి తొలగించాలని స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుని రికార్డుల్లోంచి భూమి తగ్గించుకుని ఆదర్శంగా నిలిచాడు యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూ రు మండలం అనాజిపురం గ్రామానికి చెందిన రైతు వరికుప్పల వెంకన్న. అనాజిపురం గ్రామానికి చెందిన వరికుప్పల అనిత పొడిచేడుకుర్థు పరిధిలోని 390 సర్వేనంబరులోని భూమి నాలుగు ఎకరాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఆమె పేరున పట్టా కావాల్సిన ఆ భూమి ధరణిలో అదే గ్రామానికి చెందిన వరికుప్పల వెంకన్న పాసు పుస్తకంలోకి ఎక్కింది. అనిత తన పేరున పట్టామార్పిడి చేయాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. ఆమెకు రావాల్సిన భూమి వెంకన్న పేరున ఉన్నట్టు రెవెన్యూ సిబ్బంది గుర్తించారు. క్షేత్రస్థాయికి వెళ్లి విచారించారు. రికార్డులు పరిశీలించారు. ఈ విషయమై వారు వెంకన్నను అడుగ్గా 390 సర్వే నంబరులో తనకు భూమి లేదని, తన రికార్డుల్లో మాత్రం వస్తున్నదని చెప్పాడు. అధికారుల సూచన మేరకు ఆయన మీ సేవలో తన రికార్డుల్లోంచి తనకు లేని భూమి నాలుగు ఎకరాలు తగ్గించాలని స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో మోత్కూరు తహసీల్దార్ ఉపేందర్ సోమవారం వెంకన్న పేరున రికార్డుల్లో అధనంగా ఉన్న నాలుగు ఎకరాల భూమిని ఆయన రికార్డులోంచి తొలగించి వరికుప్పల అనిత పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. స్వచ్ఛందంగా భూమిని రికార్డుల్లోంచి తగ్గించుకుని ఆదర్శంగా నిలిచిన రైతు వరికుప్పల వెంకన్నను తహసీల్దార్ ఉపేందర్, ఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది సన్మానించారు.

భారతీయ హస్తకళలు అద్భుతం

● బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గానేత్ విన్ ఓవెన్



బయో డి గ్రేడబుల్ సంచులను పరిశీలిస్తున్న ఓవెన్

చౌటుప్పల్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ హస్తకళలు అద్భుతమని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గానేత్ విన్ ఓవెన్ ప్రశంసించారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం టెక్స్‌టైల్ పార్కులోని మిమి క్రాఫ్ట్, హస్త కళా కేంద్రం, ఇండస్ట్రియల్ పార్కులోని రమణీ బయో కాంపోస్టికా పరిశ్రమను ఆమె సందర్శించారు. గిరిజనకళతో తయారు చేసిన అలంకరణ వస్తువులను పరిశీలించారు. ప్రాచీనమైన బాతిక్ పద్ధతిలో వస్త్రాలకు మైనం పూసి వివిధ రకాల ఆకృతులతో రంగులు అద్ది ఫ్యాషన్ వస్త్రాలను తయారు చేసే పద్ధతిని తిలకించారు. ప్రాచీన హస్తకళకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, భూమిలో కరిగిపోయే సంచులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేయూతనందించాలని సూచించారు. వ్యాపారం కోసం కాకుండా సమాజానికి, పర్యావరణానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న రమణి ఇండస్ట్రీస్ అధినేతలు రమణి, డాక్టర్ ప్రసాద్‌ను అభినందించారు. బయో డీగ్రేడబుల్ బ్యాగుల తయారీ ఎగుమతులకు తన వంతు సహకారమందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మినీ క్రాఫ్ట్ నిర్వాహకులు కృష్ణమూర్తి, పుష్పలత పాల్గొన్నారు.

బావిలో దూకిన మహిళ మృతదేహం లభ్యం

- అత్తింటి వారు, పోలీసుల వేధింపులే కారణం
- తల్లిదండ్రుల ఆరోపణ ● ఇరువర్గాల మధ్య కొనసాగుతున్న చర్చలు



సంధ్య మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి

ఆత్మకూరు(ఎం) మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం వ్యవసాయ బావిలో దూకిన కటిక సంధ్య శవం సోమవారం తెల్లవారు జామున లభ్యమైంది. ఆదివారం రాత్రి పోలీసులు వ్యవసాయ బావిలో నీటిని మోటార్లతో తోడి సంధ్య శవాన్ని బయటకు తీశారు. తన కూతురు సంధ్య అత్తింటి వారితో పాటు పోలీసుల వేధింపులు భరించలేక బావిలో దూకి బలవంతంగా ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తలిదండ్రులు విజయలక్ష్మి, భైరయ్య ఆరోపించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ తమ చిన్న కూతురు సంధ్యను మొర్రిపాల గ్రామానికి చెందిన కటిక క్రిష్ణతో 2024 ఫిబ్రవరి 18 న వివాహం చేశామని, పెళ్లిలో కట్నం కింద రూ.26 లక్షలు అప్పగించినట్లు తెలిపారు. ఇటీవల బైక్ కావాలంటే మరో లక్ష రూపాయలతో బైక్ కొనిఇచ్చామని తెలిపారు. పెళ్లి అయిన రెండు మూడు నెలల నుంచి తమ కూతుర్ని అల్లుడు కొట్టాడని, పెద్దల సమక్షంలో మాట్లాడి పంపించామని తెలిపారు. అయినప్పటికీ భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తొలిగిపోలేదన్నారు. తమ కుమార్తె సంధ్య అత్తగారింట్లో రూ.1.50లక్షలు దొంగతనంగా తీసుకెళ్లిందని అల్లుడు క్రిష్ణ తోపాటు అత్తమామలు కటిక మారమ్మ, రాములు, కలిసి ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో కేసుపెట్టినట్లు వారు తెలిపారు. పోలీసుల విచారణలో తనకు ఏపాపం తెలియదని చెప్పిన వినకుండా, డబ్బులు తెచ్చి చెల్లించాలని పోలీసులు వేధించారని సంధ్య తలిదండ్రులు ఆరోపించారు. సంఘటనా చేరుకున్న రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు మృతురాలి తలిదండ్రులతో మాట్లాడి సంధ్య శవాన్ని పోస్టుమార్టం కోసం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కీలకంగా మారిన సూసైడ్ నోట్

మృతురాలు (ఆత్మహత్యకు ముందు) తన చావుకు భర్త, అత్త మామలు, పోలీసుల తోపాటు పలువురు కారణమంటూ రాసిపెట్టిన సూసైడ్ నోట్ కీలకంగా మారింది. పోలీసులు తనభర్తకు సహకరించి తనను మానసికంగా చంపేశారని, తన భర్త పనిచేసిన పాఠశాలలకు చెందిన పలువురు మహిళలు సైతం కారమంటూ , వారందిరికి శిక్ష పడాలని కోరుకుంటున్నాను. అని రాసిపెట్టింది.

రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగిన చర్చలు

ఇదిలా ఉండగా మృతురాలి, క్రిష్ణ కు సంబంధించిన ఇరు గ్రామాల మధ్య ఒప్పందం కోసం పెద్ద మనుషులు సమక్షంలో సోమవారం రాత్రి పొద్దు పోయేదాక దశలవారీగా చర్చలు జరిగాయి. కాని ఒప్పందం కుదరలేదు. ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	512.70
టీఎంసీలు	136.6461
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	900 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	26.01 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	633.00 అడుగులు
టీఎంసీలు	1.84
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	627. 77 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	64.86 క్యూసెక్కులు

రైతులు కోల్పోయిన బోనస్ రూ.845కోట్లు

(5వ పేజీ తరువాయి)

వస్తుందని అధికారులు అంచనావేయగా, అందులో 17.57లక్షల మెట్రిక్‌టన్నుల సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని లెక్కలేశారు. అందులో కనీసం సగమైనా ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలుచేయాలని లక్ష్యంగా నిర్దేశించినా, క్షేత్రస్థాయిలో అందుకు తగినట్టు కొనుగోళ్లు లేవు. సన్నధాన్యం పండించిన రైతులు నేరుగా మిల్‌పాయింట్లకు, కల్లాల వద్ద వ్యాపారులకు విక్రయించేందుకే మొగ్గుచూపారు. ప్రధానంగా మిల్‌పాయింట్ల వద్ద ధాన్యం విక్రయిస్తే క్వింటాల్‌కు రూ.200 వరకు ధర తగ్గించినా, తేమ, ఇతర ప్రమాణాలను పట్టించుకోలేదని, కోతలు పూర్తయిన వెంటనే పచ్చిధాన్యాన్ని సైతం కొనుగోలు చేశారని, దీంతో తూకం కలిసొస్తుందనే కారణంతో రైతులు నేరుగా మిల్‌పాయింట్లకు, కల్లాల వద్ద వ్యాపారులకు విక్రయించారు. అదే ప్రభుత్వ కేంద్రాల వద్ద తేమశాతంతో పాటు, తాలు, మట్టిపెడ్డలు, తదితర కారణాలతో ఇబ్బందిపడాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ కేంద్రాల వద్ద విక్రయిస్తే ధాన్యం ఆరబెట్టి, మళ్లీ తూర్పారపడితే తప్ప కొనుగోళ్లు జరగడం లేదు. దీంతో క్వింటాకు కనీసం 10కిలోల వరకు తూకంలో తేడావస్తుందని, పైగా 15రోజులకు పైగా కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని, మిల్లుల వద్ద, కల్లాల వద్ద విక్రయిస్తే ఈ బాధ ఉండదనేది రైతుల వాదన. పచ్చిధాన్యం కొనుగోలుచేస్తున్నారని రైతులు క్వింటాకు రూ.500 బోనస్ సైతం కోల్పోయారు. ఉమ్మడి జిల్లాలో సన్నధాన్యం కొనుగోళ్లలో కనీస లక్ష్యాన్ని సైతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు చేరుకోలేకపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు కేవలం 4శాతం మేర అంటే సుమారు 68,971 మెట్రిక్‌టన్నుల సన్నధాన్యం మాత్రమే ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేయగా, మిల్‌పాయింట్ల వద్ద సుమారు 14లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఇప్పటివరకు కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. నెలాఖరు వరకు ధాన్యాన్ని కొనుగోలుచేసేందుకు ప్రభుత్వం అనుమతించినా, సన్నధాన్యం ఇప్పటికే కేంద్రాలకు రావడం దాదాపు నిలిచింది.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కేంద్రాల్లో మొత్తం ధాన్యం కొనుగోళ్లు ఇలా..

జిల్లా	కొనుగోలు చేసిన ధాన్యం (మెట్రిక్‌టన్నులు)
నల్లగొండ	5,42,224
సూర్యాపేట	2,70,564
యాదాద్రి	2,66,520
మొత్తం	10,79,380

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కేంద్రాల్లో సన్నధాన్యం కొనుగోళ్లు ఇలా..

జిల్లా	సన్నధాన్యం దిగుబడి (మెట్రిక్‌టన్నులు)	కొనుగోలు చేసిన సన్నధాన్యం	బోనస్ (రూ.కోట్లలో)	చెల్లింపులు
నల్లగొండ	8,67,000	19,230	9.61	-
సూర్యాపేట	8,40,000	49,146	24.57	-
యాదాద్రి	50,000	595	0.29	-
మొత్తం	17,57,000	68,971	34.48	-

పోచంపల్లిలో సీవైటీబీ స్కిన్ పరీక్షలు



సీవైటీబీ స్కిన్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భూదాన్‌పోచంపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, వారి కుటుంబ సభ్యులకు సోమవారం సీవై టీబీ స్కిన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా టీబీ మరియు లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయిశోభ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సీవైటీబీ పరీక్షల వల్ల త్వరితగతిన టీబీని నిర్ధారణ చేయవచ్చునని, వెంటనే టీబీ చికిత్స ప్రారంభించి ఈ వ్యాధిని ఎక్కువ మందికి సోకకుండా కాపాడవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యశోద, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, టీబీ సూపర్ వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, టీబీ నోడల్ పర్సన్ ఎంఏ బేగ్, ల్యాబ్ సూపర్‌వైజర్ అశ్విని, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్ బాబు, జానకి పాల్గొన్నారు.

శివకేశవులకు విశేష పూజలు



స్వర్ణ అభరణాలను అందుకుంటున్న డీఈవో భాస్కరశర్మ, ఏఈవో నవీన్‌కుమార్‌శర్మ, ప్రధాన అర్చకుడు కాండూరి వెంకటాచార్యులు

యాదగిరిగుట్ట, మే 19 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.33,97,335 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

స్వర్ణాభరణాల బహూకరణ

స్వామిఅమ్మవార్లకు సోమవారం రూ. 30లక్షల విలువ గల స్వర్ణ అభరణాలు వరంగల్ భక్తుడు బహూకరించారు. ఆకుల అనిల్‌కుమార్, హైమావతి దంపతులు రూ.17లక్షల విలువైన హారం, రూ.13లక్షల వడ్డాణం ఆలయంలో అందజేశారు. వీటిని ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో ప్రతాప నవీన్‌కుమా ర్‌శర్మ, ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు, పర్యవేక్షకుడు మాచర్ల రాజన్‌బాబు అందుకున్నారు.

యాదగిరిగుట్ట స్థానాచార్యుడిగా ప్రధానార్చకుడు



లక్ష్మీనరసింహచార్యులు

అంతర్జాతీయ దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ప్రధానార్చకుడిగా కొనసాగుతోన్న నల్లందీఘల్ లక్ష్మీనరసింహచార్యులను స్థానాచార్యులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం ఆలయ సంప్రదాయాల అనుసారం ప్రధానార్చకుడిగా కొనసాగుతూ అదనంగా స్థానాచార్యులుగా బాధ్యతలు చేపట్టేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.వెంకట్రావు ఉత్తర్వులు జారీ చేశారు. కొంతకాలంగా ఖాళీగా ఉన్న స్థానాచార్య బాధ్యతలు ప్రధానార్చకుడు నిర్వహించనున్నారు.

'బడిబాట షెడ్యూల్ సవరించాలి'

నల్లగొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ నేపథ్యంలో జూన్ 6 తేదీ నుంచి పాఠశాల విద్యాశాఖ నిర్వహించ తలపెట్టిన బడిబాట షెడ్యూల్‌ను సవరించాలని మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యం.ఏ గఫూర్, ప్రధాన కార్యదర్శి ఎండీ ముబీన్ ఒక ప్రకటనలో కోరారు. బక్రీద్ పండుగలో భాగంగా జూన్ 6న ఆర్ఫా పండుగ, 7న బక్రీద్ పండుగ ఉన్నందున షెడ్యూల్‌లో మార్పు చేసి జూన్ 9వ తేదీ నుంచి బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

ఎస్సీ బాలికల హాస్టల్‌ను పునః ప్రారంభించాలి

నాంపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఈ విద్యా సంవత్సరం పున:ప్రారంభించాలని అంబేద్కర్ యువకేంద్ర రాష్ట్ర అధ్యక్షుడు గాలెంక గురుపాదం కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతిపత్రం అందజేశారు. బాలికలు లేరని తప్పుడు సమచారంతో గతేడాది హాస్టల్‌ను అధికారులు మూసివేసినట్లు తెలిపారు. వెంటనే ప్రారంభించి మండలంలోని బాలికల ఇబ్బందులను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



నార్కట్‌పల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానం వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పూలాంకృతమైన ఆలయ మంటపంలో ఆలయ అర్చకులు కారంపూడి వేంకటాచార్యులు, కృష్ణమాచార్యుల యాజ్ఞీకంలో పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం నిర్వహించిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. దేవస్థాన అభివృద్ధికి సుమారు రూ.4లక్షల మేర ఆర్థికసాయం అందించిన యాద వెంకన్న, సునీత దంపతులు కుటుంబ సభ్యులను దేవస్థానం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలో దేవస్థానం చైర్మన్ దోసపాటి ప్రసాద్ విశాలాక్షి దంపతులు, మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెరిపోతుల భరత్, ఐతరాజు రమేష్, గంధం బాస్కర్, దోసపాటి విష్ణుమూర్తి, రఘు, వేణు, బండారు రమేష్, నర్సింహ, పుల్లయ్య, పాశం పూలమ్మ, కొప్పు భాగ్యమ్మ, స్రవంతి, బిక్షమయ్య, విజయలక్ష్మి, శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మహాలింగేశ్వరస్వామి కల్యాణం

చిట్యాల, మే 19(ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో గల శ్రీ పార్వతీ సమేత మహలింగేశ్వరస్వామి కల్యాణం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణం కనులపండువగా జరిగింది. ఎమ్మెల్యే వేముల వీరేశం కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆధ్యాత్మిక ఆలోచనలతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కల్యాణం అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, కాటం వెంకటేశం, మల్లేబోయిన మల్లేష్, దాదె విఠల్‌రెడ్డి, గంగాపురం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే మండల కమిటీ ఎన్నిక

చండూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే (హెచ్-143) చండూరు మండల కమిటీని సోమవారం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు సతీష్ గౌడ్ ప్రకటించారు. సోమవారం జరిగిన సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా బోయపల్లి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆడెపు పరమేష్, ఉపాధ్యక్షుడు చినపాక శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. మండలంలో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి, డబుల్ బెడ్‌రూం పథకం వర్తింపజేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మర్రిగూడ తహసీల్దార్‌గా శ్రీనివాసులు



శ్రీనివాసులు

మర్రిగూడ, మే 19 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ తహసీల్దార్‌గా జక్కుర్తి శ్రీనివాసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బక్క శ్రీనివాస్ బదిలీపై మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లారు. జక్కుర్తి శ్రీనివాసులు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తహసీల్దార్‌ను విద్యాశాఖ, వీరితో పాటు వివిధ పార్టీలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించారు.

స్వామివారికి ఒడిబియ్యం సమర్పణ

నకిరేకల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామంలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నకిరేకల్ వనిత శక్తి ప్రతినిధులు ఒడిబియ్యం సమర్పించారు. నకిరేకల్ వనిత శక్తి 6వ గ్రూపునకు చెందిన కొండ ప్రభాకర్ సుజాత దంపతుల ఇంటి నుంచి ఒడిబియ్యం తీసుకెళ్లి దేవాలయంలో సమపర్పించారు. కార్యక్రమంలో నకిరేకల్ కనకదుర్గ దేవాలయం చైర్మన్ బ్రహ్మదేవర పద్మ, వనిత శక్తి అధ్యక్షురాలు రావిరాల కవిత, కార్యదర్శి చల్లా రమ, కోశాధికారి మూడుదుడ్ల వెంకటలక్ష్మి, గర్రె ఝాన్సీ, బొబ్బలి సరిత, మిర్యాల రజిత, సూదిని విజయ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న లిటిల్ సోల్జర్స్

నకిరేకల్, మే 19, (ఆంధ్రజ్యోతి): భూదాన్ పోచంపల్లికి చెందిన చేరాల ఇందుజ లివర్ ఇన్‌ఫెక్షన్, కామర్లతో కొంత కాలంగా బాధపడుతూ నల్లగొండ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె తండ్రి లక్ష్మీనారాయణ రెండేళ్ల క్రితం మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఇందుజ వైద్యానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు ఆసుపత్రికి వెళ్లి ఆమె తల్లి మహేశ్వరికి రూ.15200 అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్, బొజ్జ అనిల్ పాల్గొన్నారు.

నేడు అయిటిపాములకు మంత్రి కోమటిరెడ్డి రాక

కట్టంగూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిటిపాముల గ్రామానికి మంగళవారం మంత్రి కోమటిరెడ్డి రానున్నట్లు తహసీల్దార్ గుగులోతు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా నిర్వహించే సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ కార్యక్రమాన్ని ఆచన పారంభించనున్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.

కొలతల ప్రకారమే పనులు చేయాలి

కనగల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కొలతల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలని టీఏ అద్దంకి యాదగిరి కూలీలకు సూచించారు. సోమవారం కనగల్ గ్రామ శివారులో జరిగిన ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేసారు. ఒకరికి బదులు మరొకరు పనులకు రావద్దన్నారు. ఎండల తీవ్రత నేపద్యంలో ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలన్నారు. పనిప్రదేశంలో కూలీలకు తాగునీటి వసతిని నీడ కోసం టెంట్‌ను ఏర్పాటు చేస్తామని వివరించారు. అదేవిధంగా కూలీలు వ్యక్తం చేసిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేసారు. కార్యక్రమంలో ఏపీఏ శ్యామల, ఉపాధి మేట్లు, కూలీలు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శాలిగౌరారం, మే 19 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం గురజాల గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో 2008-09సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 18 సంవత్సరాల తర్వాత కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఎంతో ఉత్సాహంగా గురువులను ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి చాలా రోజుల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకొని చిన్ననాటి మనోభావాలను, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో గురువులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, వాసు, రామ్మోహన్, ఖాజాలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు గజ్జి నరేష్ యాదవ్, పుట్ట సతీష్, నజీర్, మహేష్, పరమేష్, పార్వతమ్మ, కవిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కష్టం తీర్చమని.. కలెక్టర్ చెంతకు

» ప్రజావాణికి 97 ఫిర్యాదులు » సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నల్లగొండటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ఆదుకోండి... అంటూ జిల్లా నలుమూలల నుంచి అనేకమంది బాధితులు ఎన్నో ప్రయాసలు చేర్చి వారం వారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. వారిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై హాజరుకాగా మరికొందరు సామాజిక అంశాలపై తరలివచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరి కొన్నింటి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు లేఖలు రాశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 97 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సదరం సర్టిఫికెట్ ఇప్పించండి



నా మనవరాలు హారికను ఏడాదిన్నర క్రితం కుక్క కరవడంతో సాగర్‌లోని కమలానెహ్రూ ఆసుపత్రి లో చికిత్స నిమిత్తం తీసుకెళ్లాను. అక్కడ డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా వ్యాక్సిన్ సకాలంలో వేయకపోవడం వల్ల నా మనవరాలు కోమాలోకి వెళ్లింది. ఏడాదిన్నరగా అచేతన స్థితిలోనే ఉంది. దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే సదరం సర్టిఫికెట్ అడుగుతున్నారు. దయచేసి పింఛన్ కోసం సదరం సర్టిఫికెట్ ఇచ్చేలా చర్యలు తీసుకోండి.

\- కొమ్ము రాందాస్, నాగార్జునసాగర్

అవకతవకలపై విచారణ జరిపించాలి



ఎఫ్‌సీఐ హమాలీ కో-ఆపరేటివ్ సొసైటీ పేరిట 30 సంవత్సరాల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకుని మిర్యాలగూడలోని ఎఫ్‌సీఐ లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాం. మేమంతా కొంత నగదును పోగు చేసుకోగా ఎఫ్‌సీఐ సంస్థ వారి ఇచ్చిన కొంత మొత్తంతో కలిపి సంస్థ పేరిట 16.32 ఎకరాల భూమిని కొనుగోలు చేశాం. అయితే ఆ భూమిని సభ్యులందరికీ తెలియకుండానే అప్పటి అధ్యక్షుడు 2000- 2003 కాలంలో 6.32 ఎకరాల భూమిని విక్రయించారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం ఉన్న భూమిని కూడా విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి సభ్యులందరికీ న్యాయం చేయాలి.

\- ఎఫ్‌సీఐ హమాలీ కార్మికులు, మిర్యాలగూడ

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలి



నేను నిరుపేదకు దళిత కుటుంబానికి చెందిన మహిళను. నాకు మా గ్రామంలో ఎలాంటి ఆస్తుపాస్తులు, ఇల్లు కూడా లేదు. కూలీనాలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఇటీవల ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. తాజాగా విడుదల చేసిన ఇందిరమ్మ ఇంటి జాబితాలో నా పేరు లేదు. అన్ని విధాలుగా అర్హురాలైన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి ఆదుకోండి.

\- అన్నపాక వాణి, యాచారం, అనుముల

ఏడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న



మాకు మా గ్రామంలోని సర్వే నెంబర్ 11లో 2.10 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి మాకు మాకు తాతల ముత్తాతల నుంచి వంశపారపర్యంగా సంక్రమించింది. అట్టి భూమిని తాము సేద్యం చేసుకుంటూ మేము జీవనం కొనసాగిస్తున్నాం. అయితే ఇటీవల ఓ వ్యక్తి తమ భూమిని దౌర్జన్యంగా లాక్కునేందుకు ప్రయత్నించాడు. అక్రమ పద్ధతిలో పట్టా చేసుకునేందుకు ప్రయత్నించగా మేము అడ్డుకున్నాం. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మాకు పాస్ పుస్తకాలు ఇప్పించాలని అధికారులను వేడుకున్నాం. అయితే భూమి వివాదంలో ఉందంటూ పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు నిరాకరించారు. పాస్ పుస్తకాల కోసం ఏడేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. అయినా ఫలితం లేదు. దయచేసి పాస్ పుస్తకాలు ఇప్పించండి.

\- సావిత్రమ్మ, ఇరికిగూడెం, దామరచర్ల

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేశం



శాలిగౌరారం: ఊట్కూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్, పక్కన ఎమ్మెల్యే వేముల వీరేశం

శాలిగౌరారం, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ భక్తి భావం అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత కలుగుతుందని, గ్రామస్తులు కలిసి కట్టుగా ఉండి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం అన్నారు. శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో యాదవుల నిర్వహించిన శివగంగ కల్యాణ మహోత్సవానికి వారు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే వేముల వీరేశం లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఊట్కూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామం చైతన్యంలో ముందంజలో ఉందికానీ అభివృద్ధిలో వెనుకబడి ఉందని, అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరు శం కర్‌రెడ్డి, నాయకులు కుర్ర లింగయ్య, వేముల గోపినాథ్, బొల్లికొండ గణేష్, రామచంద్రయ్య, జహంగీర్, అశోక్‌రెడ్డి, నోముల జనార్ధన్, పరశురాములు, సురేందర్‌రెడ్డి, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

పండగలు, జాతరలు సంప్రదాయాలకు ప్రతీకలు...

కేతేపల్లి: గ్రామాల్లో నిర్వహించే పండగలు, జాతరలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. మండలంలోని మండలంలోని భీమారం, తుంగతుర్తి గ్రామాల్లో యాదవులు తమ ఆరాధ్య దేవతలు గంగాభవానీ, సౌడమ్మ, లింగమంతులస్వామి పండగలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలను సమర్పించి తమను, తమ కుటుంబాలను చల్లగా చూడాలని కోరుకున్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వీరేశం పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఆయా వేడుకల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గుత్తా మాధవరెడ్డి, ఎం.వెంకట్రాంరెడ్డి, బడుగుల నరేందర్‌యాదవ్, కీర్తి వెంకన్న, కె.ప్రదీప్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

కేతేపల్లి: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో రూ.5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు మాధవరెడ్డి, నరేందర్ యాదవ్, వెంకట్రాంరెడ్డి, కీర్తివెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

నకిరేకల్: క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నకిరేకల్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పన్నాల రాఘవరెడ్డి, నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య, చౌగోని శ్రీనివాసు, యాసారపు వెంకన్న, వీరూ, క్రీడాకారులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం



నల్లగొండలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, మే 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం నల్లగొండలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య ప్రజల కోసం తనకు వారసత్వంగా వచ్చిన వందలాది ఎకరాల భూమిని పేదలకు పంచి, నిరాడంబర జీవితాన్ని గడిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎండీ సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, నలపరాజు సైదులు, ఆకారపు నరేష్, పోలే సత్యనారాయణ, బి.పరిపూర్ణాచారి పాల్గొన్నారు.

● సెంట్రింగ్ సొసైటీ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, అద్దంకి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

● నల్గొండలోని 11వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ, సత్తయ్య, చంద్రయ్య, యాదయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి బస్‌స్టేషన్ సెంటరులో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో శ్రీరామోజు వెంకటేశ్వర్లు, చెర్కు పెద్దులు, కుమ్మరి శంకర్, ఆమనగంటి ఐలయ్య, కొప్పు శ్రవణ్, దండు రవి పాల్గొన్నారు.

● చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంల సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, అరూరి శ్రీను, బొబ్బల సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు. చిట్యాల మండలం వెలిమినేడులో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లం మహేశ్, అరూరి శ్రీను, పంది నరేశ్, దేశబోయిన నర్సింహ, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, సీహెచ్ లూర్దుమారయ్య, వి.వెంకన్న, సీహెచ్ నాగయ్య, సత్తయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

● మర్రిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో నీలకంఠ రాములు, కొట్టం యాదయ్య, రామలింగాచారి పాల్గొన్నారు.

● కట్టంగూరులో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, గుసుగుంట్ల రామకృష్ణ, చిలుకూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

● కనగల్ ఎక్స్ రోడ్డులో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కానుగు లింగస్వామి ఎఅక్రమ్, శేఖర్‌రెడ్డి, లింగయ్య, కేశవులు,పాల్గొన్నారు.

● నకిరేకల్‌లోని ఏఆర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు, సాకుంట్ల నర్సింహ, వంటెపాక కృష్ణ పాల్గొన్నారు.

స్తంభాల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లగొండ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మండలంలోని రసూల్‌పుర గ్రామంలో ఈదురు గాలులకు పడిపోయాయి. ఈ విషయమై సోమవారం 'విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయరూ' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు సోమవారం ఉదయం 8 గంటలకే రసూల్‌పుర గ్రామానికి చేసుకొని కూలిన స్తంభాలను నిలబెట్టారు. రైతు జానయ్య మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులకు 15 రోజుల క్రితం మొర పెట్టుకున్నా స్పందించలేదని అన్నారు. 'ఆంధ్రజ్యోతి' లో వార్త రావడంతో సమస్య పరిష్కారమైందని కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఆర్ఎంపీలపై దాడులను ఆపాలి

చండూరు, మే19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత వైద్యులపై నేషనల్ మెడికల్ కమిషన్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నలపరాజు రామలింగయ్య డిమాండ్ చేశారు. చండూరులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఆర్ఎంపీలకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను జారీ చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఎంతో కాలం నుంచి వైద్య సేవలు అందిస్తూ, జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. గ్రామీణ వైద్యులపై తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తూ, దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడులను ఆపకుంటే జిల్లాలోని ఆర్ఎంపీలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, ఆర్ఎంపీలు బొడ్డు వెంకటేశ్వర్లు, తిప్పర్తి రాములు, బరిగెల వెంకటేశ్, బండమీది వెంకన్న, దోటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ సత్తా చాటిన ఆపరేషన్ సిందూర్



ర్యాలీలో పాల్గొన్న సీఐ, తదితరులు

చిట్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ భారత సైన్యం సత్తా చాటిందని సీఐ కల్లూరి నాగరాజు అన్నారు. చిట్యాలలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో భారత ఆర్మీకి సంఘీభావంగా సోమవారం నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ భారత రక్షణదళం సామర్థ్యం దాయాది పాకిస్తాన్‌కే కాకుండా ప్రపంచానికి చాటిందన్నారు. దేశం విషయంలో రాజకీయాలు, మతాలు, వర్గాలకతీతంగా అందరూ బాసటగా నిలవాలని కోరారు. అంతకుముందు జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నాయకులు ఏళ్ల బయ్యన్న, పెద్ది నరేందర్, మండల అధ్యక్షుడు మెండె వెంకన్న, ప్రధాన కార్యదర్శి పోకల కరుణాకర్, చెరుపల్లి శ్రీనివాస్, నూతి లింగస్వామి, ఏళ్ల వెంకన్న, వివిధ పార్టీల నాయకులు పోకల దేవదాస్, చినమల్లయ్య, నరేష్‌గౌడ్, ఆదిమల్లయ్య, హనుమంతు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నల్లగొండ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

'పీఏసీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

చిట్యాల రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని వెలిమినేడులో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న పీఏసీఎస్ సిబ్బందిపై రైతులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడుతున్నారని రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఒకే రకమైన ధాన్యానికి ధరను నిర్ణయించడంలో పక్షపాతం చూపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకే రకమైన ధాన్యానికి ఓ రైతుకు రూ.2320లు మరో రైతులకు బీ గ్రేడ్ అని చెప్పి రూ.2300 నమోదు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో పాటు అదనంగా క్వింటాల్‌కు 3 నుంచి 5 కిలోల వరకు తరుగు పేరుతో కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ సిబ్బంది అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. చేకూరి గణేష్ ఆధ్వర్యంలో పలువురు రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ప్రజల ప్రాణాలతో..

చెలగాటం

(5వపేజీ తరువాయి)


మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కార్పొరేట్ సేవల పేరుతో ఆర్ఎంపీలు, పీఎంపీలకు 30 నుంచి 40శాతం కమీషన్ ముట్టజెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ కార్పొరేట్‌స్థాయి ఆస్పత్రులకు కొందరు దళారులుగా, మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు.

మెడికల్ కౌన్సిల్ చర్యలు

జిల్లాలో నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 14 నకిలీ వైద్య సెంటర్లపై ఆయా పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేయించింది. నల్లగొండ పట్టణంలో దేవరకొండరోడ్డు, ముషంపల్లిరోడ్డు, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు క్లీనిక్‌లపై కేసులు నమోదయ్యాయి. ఎన్జీ కళాశాల సమీపంలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్, మునుగోడులో పలు కేంద్రాలు, తిప్పర్తిలో ఫస్ట్ ఎయిడ్ క్లీనిక్‌లపై కేసు నమోదు చేశారు. 2024లో జూన్ 16న మొదటి విడతగా ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేయగా, ఈ ఏడాది జనవరి 8న కేసులు నమోదు చేశారు. తాజాగా, ఈనెల 18వ తేదీన జిల్లాలో 18 నకిలీ వైద్య క్లీనిక్‌లపై కేసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రంతో పాటు తిప్పర్తి, మునుగోడు ప్రాంతాల్లో 14మంది నకిలీ వైద్యులపై ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

అడ్డుకట్ట పడేనా?

నకిలీ వైద్యానికి అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఎంబీబీఎస్‌తో సంబంధం లేకుండానే కొంతమంది కార్పొరేట్ ఆస్పత్రులు ఏర్పాటు చేసి రోగుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనవసర పరీక్షలు చేయిస్తూ లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నారు. మెడికల్ షాపుల నిర్వహణ కూడా అదేవిధంగా ఉంది. ఎవరివో సర్టిఫికెట్లతో మెడికల్ షాపులు నిర్వహిస్తూ డాక్టర్ సిఫారస్సు లేకుండానే మందులు విక్రయించడం నిత్యకృత్యమైంది. రక్త పరీక్షలతో పాటు ఇతర అన్ని పరీక్షలకు సైతం అవగాహన లేని వారు ఉండటం గమనార్హం. రక్తపరీక్షలతో పాటు ఇతర పరీక్షలపై అవగాహన లేకున్నా రోగులకు ఏదో ఒక రిపోర్టు ఇచ్చి లేని జబ్బు అంటగట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రధానంగా మధుమేహం, బీపీ పరీక్షలతో పాటు ఇతర పరీక్షలన్నీ చేస్తూ అవగాహన లేకుండానే రిపోర్టులు ఇచ్చి రోగులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారు.




చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.5
కనిష్ఠం	24.0

పట్టుదలకు సరస్వతీ ప్రసన్నం

పట్టుదలకు మారుపేరుగా నిలుస్తోంది పుట్టల ప్రసన్న. తల్లిదండ్రులు చిన్నతనంలోనే దూరమైనా నానమ్మ సంరక్షణలో పెరిగి దీక్షగా చదివింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇచ్చిన స్ఫూర్తితో హాస్టల్‌లో అదనంగా గంట పాటు చదివి అందరికంటే చివరగా నిద్రపోయేది. కృషికి తగ్గట్టుగా పదో తరగతిలో 563 మార్కులు (10జీపీఏ) సాధించి టాపర్‌గా నిలిచి విమాన ప్రయాణం చేసింది.

6

ప్రజల ప్రాణాలతో
చెలగాటం



- ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్న నకిలీ వైద్యులు
- పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ
- నకిలీ వైద్యులపై మెడికల్ కౌన్సిల్ చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా జిల్లాలో మాత్రం నకిలీ వైద్యుల బెడద తప్పడం లేదు. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో నకిలీ వైద్యులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గతంలో కొందరు కాంపౌడర్‌లుగా పనిచేసి టీఎస్ఎంపీఆర్ నిబంధనలకు విరుద్ధంగా వైద్యులుగా చెలామణి అవుతూ అందరినీ మోసం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులబారిన పడిన వారిని పట్టణ ప్రాంతాలల్లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్‌చేసి వాటి సహాయంతో రోగుల నుంచి డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అవసరంలేని పరీక్షలు చేయిస్తూ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పర్సంటేజీలు ఇస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. కొందరు అర్హత లేకున్నా, ఆర్ఎంపీగా బోర్డు ఏర్పాటుచేసి అక్రమంగా అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు వినికిడి. క్లినిక్‌లతో పాటు ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లను అడ్డగోలుగా ఏర్పాటుచేసి వైద్యులమని నమ్మబలుకుతూ ఇష్టానుసారంగా యాంటీబయాటిక్, స్టెరాయిడ్స్, నొప్పి నివారణ ఇంజక్షన్‌లు ఇస్తూ రోగుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు.

పట్టించుకోని వైద్యఆరోగ్యశాఖ...

జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ నకిలీ వైద్యులపై పట్టనట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు అసలు దృష్టి సారించకపోవడంతో నకిలీ ఆర్ఎంపీల ఇష్టారాజ్యమైంది. తెలిసీ తెలియని వైద్యం చేసి, రోగుల పరిస్థితి విషమించిన తరువాత పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి విలువైన ప్రాణాలు తీస్తున్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో మొత్తం నకిలీ వైద్యులదే హవాగా మారింది. కొన్నేళ్లుగా వీరిపై ఫిర్యాదులు వస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల నల్లగొండ, కోదాడ, మిర్యాలగూడ, సూర్యాపేటలో ప్రైవేట్ ఆస్పత్రులు పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యాయి. నల్లగొండ పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రుల

- మిగతా 8వ పేజీలో...



రైతులు కోల్పోయిన బోనస్
రూ.845కోట్లు

- మిల్లులకు సన్నధాన్యం విక్రయించడంతో ఈ పరిస్థితి
- ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించిన ధాన్యం 4శాతమే
- బోనస్ కోల్పోతున్నా, ధర తక్కువ ఇచ్చినా పట్టించుకోని వైనం
- తేమ, తాలు నిబంధనలే కారణమంటున్న రైతులు
- నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లకు గడువు

సన్నధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్నా రైతులు పట్టించుకోలేదు. సన్నధాన్యం పండించడానికి పోటీపడ్డ రైతులు, విక్రయాల్లో మాత్రం ప్రభుత్వ సూచనలు పట్టించుకోకుండా, నేరుగా మిల్‌పాయింట్లు, వ్యాపారులకే విక్రయించారు. దీంతో బోనస్ కోల్పోవడమే గాక, తక్కువ ధర వచ్చినా, రైతులు వ్యాపారులకు ధాన్యం విక్రయించేందుకు మొగ్గుచూపారు. ఫలితంగా ఉమ్మడి జిల్లా రైతులు రూ.845కోట్ల బోనస్‌ను కోల్పోయారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

యాసంగి సీజన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 17.57లక్షల మెట్రిక్‌టన్నుల సన్నధాన్యం దిగుబడి రాగా, అందులో కేవలం 4 శాతం మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. మిగిలిన ధాన్యం మొత్తం మిల్‌పాయింట్ల వద్ద వ్యాపారులే కొనుగోలుచేశారు. ధాన్యం ముమ్మరంగా వచ్చినప్పుడు, పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం వచ్చినప్పుడు కనీస మద్దతు కంటే ధర తగ్గించినా మిల్లుల వద్ద విక్రయానికే రైతులు మొగ్గుచూపారు. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించకపోవడంతో రైతులు సుమారు రూ.845కోట్ల బోనస్‌ను కోల్పోయారు. కేంద్రాల వద్ద సన్నధాన్యం విక్రయించకపోవడానికి కారణాలను ప్రభుత్వం విశ్లేషించాల్సి ఉంటుందని, లేదంటే ప్రభుత్వం సన్నబియ్యాన్ని మిల్లర్ల వద్ద కొనుగోలు చేస్తే తప్ప వినియోగదారులకు పంపిణీచేయలేని పరిస్థితి ఎదుర్కోవల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సన్నధాన్యం కొనుగోళ్లలో హవా చాటిన మిల్లర్లు

ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో దాదాపు 29.28లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి

- మిగతా 7వ పేజీలో...

నెలాఖరు వరకు కొనుగోళ్లు...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 1,053 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 29.19లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వరి భారీగా సాగు కావడం, దిగుబడి సైతం భారీగా రావడంతో నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో గతవారం వరకు కేంద్రాల వద్ద ఎటుచూసినా ధాన్యం రాశులే కనిపించాయి. కాంటాల కోసం రైతులు, కేంద్రాల నిర్వాహకులు అవస్థలుపడాల్సిన పరిస్థితి కొనసాగింది. కలెక్టర్లు సైతం నేరుగా రంగంలోకి దిగి కాంటాలు, రవాణాపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవడంతో ఈ రెండు జిల్లాల్లో పరిస్థితి కుదుటపడగా, సూర్యాపేట జిల్లాలో ఇంకా కేంద్రాల వద్ద ఒత్తిడి కొనసాగుతూనే ఉంది. కాంటాలు వేస్తున్నప్పటికీ ఆ జిల్లాలో మిల్లులు తక్కువగా ఉండడం, నల్లగొండ జిల్లాలోని మిల్లులకు ధాన్యం కేటాయించడంతో రవాణాలో జాప్యం జరుగుతుండడంతో ఈ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఒత్తిడి యథావిధిగా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ మూడు జిల్లాల్లో కలిపి 10.80మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇంకా కేంద్రాల వద్ద, రైతుల కల్లాల వద్ద ధాన్యం భారీగానే ఉంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నెలాఖరువరకు కేంద్రాలను కొనసాగించాల్సి ఉంటుందనే అంచనాకు వచ్చిన అధికార యంత్రాంగం ఆయా గ్రామాల్లో పరిస్థితికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను మూసివేస్తూ, ధాన్యం వస్తున్న కేంద్రాలను కొనసాగిస్తున్నారు. నెలాఖరు వరకు ఇలాగే వచ్చిన ధాన్యం వచ్చినట్టు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

చెల్లించాల్సిన బోనస్ పెండింగ్

ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన సన్నధాన్యానికి సంబంధించి బోనస్ ఇంకా రైతుల ఖాతాల్లో జమకాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 68,971 మెట్రిక్‌టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేయగా, అందుకుగాను రూ.34.48కోట్ల విలువైన బోనస్ రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే రైతుల ఖాతాల వివరాలు సేకరించిన పౌరసరఫరాలశాఖ ఆన్‌లైన్‌లో వాటి నమోదును కూడా పూర్తి చేసింది. తొలుత ధాన్యం బిల్లులు క్లియర్ చేస్తుండడంతో అవి కొలిక్కి వచ్చాక బోనస్‌ను ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ వారాంతంలోగా బోనస్ మొత్తం రైతుల ఖాతాల్లో నేరుగా జమవుతుందని వారు పేర్కొంటున్నారు.




ఇళ్ల స్థలాలపై హక్కులు కల్పించాలి

రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

గట్టుప్పల్, మే 19 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం ప్రకారం అసైన్డ్, ఇళ్ల స్థలాలకు హక్కులు కల్పించాలని రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ భారతిలో లోపాలను కూడా సరిచేయాలన్నారు. ధరణిలో ఉన్న లోపాలను అధిగమించామని ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే లోపాలను సరిచేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, నాయకులు చాపల మారయ్య, కర్నాటి మల్లేశం, సాగర్ల మల్లేష్, జెర్రిపోతుల ధనుంజయ, మిర్యాల భరత్, వరికుప్పల ముత్యాలు, కర్నాటి సుధాకర్, పగిళ్ల శ్రీనివాస్, వేముల లింగస్వామి, కర్నాటి వెంకటేశం, పగిళ్ల యాదయ్య, పెద్దగాని నరసింహ, ముసుకు బుచ్చిరెడ్డి, పబ్బు మారయ్య, కృష్ణయ్య, ఈరటి వెంకటయ్య పాల్గొన్నారు.



డిండి మండలం కందుకూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

డిండి, మే 19(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండలంలోని కందుకూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సుమారు 200 లారీల ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని తెలిపారు. అధికారులు, అధికారపార్టీ ఎమ్మెల్యేలు రైతులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కష్టపడి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే దుస్థితి లేదని వాపోయారు. విక్రయించిన ధాన్యం డబ్బు కోసం రైతులు రోజులతరబడి ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఆసరా చేసుకొని వ్యాపారులు, మిల్లర్లు రైతులను నిలువుదోపిడి చేస్తున్నారని విమర్శించారు. తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి లారీల కోసం పడిగాపులుకాయలేక రైతులు వ్యాపారులకు నష్టానికే ధాన్యం విక్రయించే దుస్థితి ఏర్పడిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లాలు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, ఏటి కృష్ణ, బర్పటి కొండల్, సాయికుమార్, ముడి శ్రీకాంత్, రమేష్, వెంకటేష్, ప్రసాద్, భాస్కర్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

● ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ


నల్లగొండలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): 'ప్రజావాణి' ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. సుమారు 97 మంది ఫిర్యాదులు అందజేయగా, అందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందినవి 53 వరకు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ వారం ఫిర్యాదుదారుల సంఖ్య పెరుగుతున్నందున జిల్లా అధికారులు శ్రద్ధ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఒకవేళ సమస్య పరిష్కారంకాకుంటే ఎందుకు కాలేదో స్పష్టంగా తెలియజేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. భవిత కేంద్రాల్లో సౌకర్యాలు, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోలు, తాగునీరు, విద్యుత్, టీఎస్ ఐపాస్, టీప్రైడ్ అంశాలను సమీక్షించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్‌అమిత్, రాజ్‌కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఆర్‌వో వై.అశోక్‌రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం'లో జిల్లాను ముందుంచాలి

నల్లగొండ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం అమలులో జిల్లాను ముందుంచేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బ్యాంక్ కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పథకం కింద వచ్చిన దరఖాస్తులను బ్యాంకర్లు సిబిల్‌ను వెంటనే పరిశీలించి ఎంపీడీవోలకు అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ప్రతీ దశకు ఒక సమయాన్ని నిర్దేశించి, ఆలోగా అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీచేసిందన్నారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 73,646 దరఖాస్తులు రాగా, అర్హత ఉన్న 73,200 దరఖాస్తుల సిబిల్‌ను పరిశీలించి సంబంధిత ఎంపీడీవోలకు అందజేయాలన్నారు. ఎంపీడీవోలు వారి స్థాయిలో అన్ని అర్హతలు పరిశీలించి ఈనెల 25లోగా లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని ఆదేశించారు. కాగా, ఇప్పటివరకు బ్యాంకర్లు 11వేల దరఖాస్తుల సిబిల్ పరిశీలించి ఎంపీడీవోలకు అందజేశారని, 6,500 దరఖాస్తులను అప్డేట్ చేసినట్లు లీడ్ బ్యాంక్ అధికారి శ్రామిక్ వివరించారు. మిగిలినవి వెంటనే పరిశీలించి ఎంపీడీవోలకు అందజేస్తామన్నారు. మంగళవారం నాటికి 60 శాతం పురోగతి సాధించాలని కలెక్టర్ కోరారు. బ్యాంకర్లు జాప్యంచేస్తే సమస్యను ఫైనాన్స్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే లబ్ధిదారులకు సబ్సిడీ, రుణాన్ని మంజూరు చేసేందుకు వెంటనే బ్యాంకు ఖాతాను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ శేఖర్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఖాజా నసీరుద్దీన్, విజయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యాసంస్థలో ప్రవేశం పొందాలి

మైనార్టీ విద్యాసంస్థల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు సమీపంలోని మైనార్టీ విద్యాసంస్థల్లో సంప్రదించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ, జిల్లాలో 13 మైనార్టీ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, వీటిలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒక్కో తరగతిలో సుమారు 60 వరకు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ముందుగా వచ్చిన వారికి ముందుగా కేటాయించే పద్ధతిని పాటిస్తామని తెలిపారు. వివరాలకు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ సెల్ నంబర్ 7331170877లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విద్యాసంస్థల జిల్లా అధికారి విజయేందర్‌రెడ్డి, ఆర్‌సీవో విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటం, త్యాగాల తొవ్వలోనే సమసమాజం

- కమ్యూనిస్టు చుక్కాని సుందరయ్య
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి


సుందరయ్య వర్ధంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న పార్టీ నాయకులు

మిర్యాలగూడ, మే 19(ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోరాటం, త్యాగాల తొవ్వలోనే సమసమాజ స్థాపన సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఈదులగూడెం చౌరస్తాలోని సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని సీనియర్ నేత పారేపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం ఈదులగూడెం నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా సీపీఎం కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 35 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ సిద్ధాంతం, ఆచరణ మేళవించిన గొప్ప ఆదర్శనాయకుడు సుందరయ్య అని అన్నారు. ధనిక కుటుంబంలో పుట్టినప్పటికీ నిత్యజీవితంలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు కొనసాగించారని అన్నారు. ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యుడిగా ఉండి సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి చట్టసభల్లో పేదల గొంతుకగా మారి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. కమ్యూనిస్టు కార్యకర్తలకు, నేతలకు సుందరయ్య చుక్కాని లాంటివారని అన్నారు. దేశ పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేస్తూ అందుకు అనుగుణంగా ఉద్యమ రీతులను మార్చుకుంటూ చివరివరకు ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని అన్నారు. జ్యోతి ఆస్పత్రి వైద్యుడు మువ్వా రామారావు మాట్లాడుతూ, కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు ముఖ్యం కాదని ప్రజలే ఎజెండాగా పనిచేయాలన్నారు. ఆకలి, పేదరికం ఉన్నంతవరకు కమ్యూనిజం బతికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీశ్ చంద్ర, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, రవినాయక్, తిరుపతి రాంమూర్తి, వరలక్ష్మి, పాదూరి శశిధర్‌రెడ్డి, రెమిడాల పరుశరాములు, గోవర్ధనా, ఆయూబ్, చౌదరి సీతారాములు, వినోద్‌నాయక్, వాడపల్లి రమేశ్, ఊర్మిల, సైదమ్మ, పిల్లుట్ల సైదులు, రామారావు, సైదులు, వెంకట్‌రెడ్డి, అంజద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల

ప్రాజెక్టులకు మోక్షం

- త్వరలో టెండర్లు నిర్వహించేందుకు సన్నాహాలు
- కొనసాగుతున్న భూపరిహారం, పునరావాసం ప్రక్రియ

7

పేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి


ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), మే 19 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాజకీయాలకు అతీతంగా ప్రజల పక్షాన నిలుస్తానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిలకాపురం గ్రామంలో మూడున్నర ఎకరాల్లో అర్హులైన 121 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హోంమంత్రిగా పనిచేసే కాలంలో జానారెడ్డి ఈ ప్రాంత పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలాలు లేవని గుర్తించారని, అందుకే పలు గ్రామాల్లో ప్రభుత్వ పట్టా భూములు సేకరించేందుకు కృషి చేశానన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో ఆ స్థలాలను పేదలకు పంపిణీ చేయడంలో బీఆర్ఎస్ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. మళ్లీ తామే ప్రస్తుతం ఆ స్థలాలను రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో బోయగూడెం, రాజవరం, కొంపల్లి గ్రామాల్లో కూడా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీచేసి న్యాయం చేస్తామన్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కుందూరు జానారెడ్డికే దక్కుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, నాయకులు మాటలు చెప్పారేగాని చేతలు చేయలేదని, పేదల కోసం ఒక్క ఇల్లు కట్టిన దాఖలాలు లేవని విమర్శించారు. సాగర్ ఉప ఎన్నికలో పెండింగ్‌లో ఉన్న భూములకు పట్టా పాస్ పుస్తకాలు ఇస్తామని, నెల్లికల్ లిఫ్టును పూర్తి చేస్తామని హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెవెన్యూ పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు, నెల్లికల్ లిఫ్టు పనులు కొనసాగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణానాయక్, నాయకులు శాగం రాఘవరెడ్డి, కట్టెబోయిన అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లుగౌడ్, గాలి చంద్రకళ, లాలునాయక్, అనుముల అంజి, మెరావత్ మునినాయక్, తదితరులు పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి ఉత్సవాలు

నల్లగొండ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్తీలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 22వ తేదీన హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బైరగోని రాజయ్య, బండారు ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాలను అన్ని హంగులతో తీర్చిదిద్దామని, భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకాలు, మండపారాధన, మహాస్నపన, 10 గంటలకు హోమం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం స్వామివారిని పురవీధుల గుండా హనుమాన్ పల్లకి సేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు పంచామృతాలతో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సురిగి యాదగిరి, కాశమ్మ, వెంకన్న, శేఖర్, శంకర్, శ్రీను, మధు, సురేష్, కోటి, దిలీప్, లింగస్వామి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజయ్య

ఎస్ఐగా రామ్మూర్తి బాధ్యతల స్వీకరణ



చింతపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): చింతపల్లి ఎస్ఐగా ఎం.రామ్మూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన యాదయ్య హైదరాబాద్‌కి బదిలీకాగా కొండమల్లేపల్లిలో పనిచేస్తున్న రామ్మూర్తి చింతపల్లి వచ్చారు. ఈ సందర్భంగా రాంమూర్తి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా జాన్‌రెడ్డి



మాడ్గులపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఇటికాల జాన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ మండల ఇన్‌చార్జి నాగిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఉయ్యాల పాండు, చిట్టింకి మల్లేష్, నంద్యాల శ్రీను, చంటి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

ఆరుబయటే ఓపీ సేవలు



నిడమనూరు పీహెచ్‌సీలో చెట్ల కింద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది.

- విద్యుదాఘాతంతో భవనం దగ్ధం
- చెట్ల కిందే వైద్యం
- నూతన భవనం పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు
- నిడమనూరు పీహెచ్‌సీలో పరిస్థితి

నిడమనూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం(పీహెచ్‌సీ) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి దహనమైంది. దీంతో సిబ్బంది సోమవారం ఆస్పత్రి ఆవరణలో చెట్ల కింద విధులు నిర్వహించారు. ఆరుబయటే రోగులకు ఓపీ సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీ పాతభవనం కావడంతో శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులు తరచుగా ఊడిపడుతూ ప్రమాదానికి నిలయంగా మారింది. శ్లాబు లీకేజీ కావడంతో వర్షాలు కురిస్తే నీరు లోపలికి వచ్చేది. దీనికితోడు శిథిల భవనం కావడంతో విద్యుత్ వైర్లు, బోర్డులు, పైపులు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. దీంతో కొన్ని గదుల్లో కరెంటు సరఫరా ఉండగా, మరికొన్ని గదుల్లో సరఫరా అయ్యేది కాదు. అయినా వైద్యులు, సిబ్బంది ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఉంది. పక్కనే నిర్మిస్తున్న నూతన భవనం ఏడాది క్రితం పూర్తి చేసి పీహెచ్‌సీకి అప్పగించాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పూర్తి కాలేదు. దీంతో శిథిల భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పీహెచ్‌సీలోని స్టోర్‌రూంలో ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. 24 గంటల ఆస్పత్రి కావడంతో స్టాఫ్‌నర్స్ సహ కొందరు సిబ్బంది, నైట్ వాచ్‌మన్ కూడా అందులోనే నిద్రిస్తున్నారు. మంటలు కమ్ముకోవడంతో గమనించి భయంతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. స్టోర్‌రూంలో మొదలైన మంటలు ఆస్పత్రి అంతటా వ్యాపించడంతో భవనం దగ్ధమైంది. పీహెచ్‌లోని మందులు, రికార్డులు, కంప్యూటర్లు, ప్రింటర్లు, ఫర్నీచర్, బెడ్లు, ఫ్రిజ్‌లు, ఐఎల్ఆర్ రిఫ్రిజిరేటర్లు, సీబీపీ మిషన్ తదితర వస్తు సామగ్రి పూర్తిగా కాలిపోయింది. భవనం దగ్ధమైనా ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరు హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యుదాఘాతం కారణంగా భవనం దగ్ధం కావడంతో పాటు పైకప్పు పెచ్చులు కూడా పెద్ద ఎత్తున ఊడిపడ్డాయి.

దీంతో పీహెచ్‌సీలోకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణలో చెట్టు కింద విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు రోజులుగా చెట్ల కిందే విధులు నిర్వహిస్తూ రోగులకు మందులు అందిస్తున్నారు. కొత్త భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భవనం పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న బాలికల హాస్టల్‌లో తాత్కాలికంగా వైద్య సేవలు అందించేందుకు అనుమతి కోరారు.

ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు

పీహెచ్‌సీలో అగ్ని ప్రమాదం జరగడంతో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఓపీ సేవలకు ఎలాంటి సమస్య లేదు. కొత్త భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించాం. ఎదురుగా ఉన్న ప్రభుత్వ బాలికల వసతిగృహంలో తాత్కాలికంగా ఆరోగ్య సేవలు అందించేందుకు సంబంధిత అధికారుల అనుమతి కోరడం జరిగింది.

\- డాక్టర్ అరవింద్, వైద్యాధికారి.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సత్యం

నిడమనూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులతో రైతులు పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరిట సోమవారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి నేల తల్లి ఆరోగ్యం కాపాడాలన్నారు. యూరియాను తక్కువగా వినియోగిస్తే సాగు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి రైతులు పంటలు సాగు చేయాలన్నారు. సదస్సులో విత్తనాల గురించి కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన సంస్థ అధిపతి డాక్టర్ ఎన్. లింగయ్య, పంటల మార్పిడి గురించి శాస్త్రవేత్త శ్రీధర్ రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో హాలియా ఏడీఏ సరిత, సీడ్ ఆఫీసర్ రాంబాబు, ఏఈవో విజయచంద్ర, పంచాయతీ కార్యదర్శి నర్సింహాచారి, బొల్లం బాలయ్య, బెలిదె అశోక్, కరుణాకర్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా అనుగ్రహం పొందాలి

● మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



పూజల్లో పాల్గొన్న రవీంద్రకుమార్ దంపతులు

చింతపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ సాయిబాబా అనుగ్రహం పొందాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిభావం పెంపొందించుకోవడం ద్వారా ముక్తి మార్గం లభిస్తుందన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వాదం అందించారు.

కాంగ్రెస్ కార్యకర్త మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి

నాగార్జునసాగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): పెద్దవూర మండల పరిధిలో పెద్దగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పిడిగం వెంకటేశ్వర్లు (31) అనే వ్యక్తి గుండెపోటుతో సోమవారం ఉదయం సాగర్ ఆస్పత్రిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని వెంకటేశ్వర్లు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు.

ప్రజల ప్రాణాలతో...

చెలగాటం

(5వపేజీ తరువాయి)

మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కార్పొరేట్ సేవల పేరుతో ఆర్ఎంపీలు, పీఎంపీలకు 30 నుంచి 40శాతం కమీషన్ ముట్టజెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ కార్పొరేట్‌స్థాయి ఆస్పత్రులకు కొందరు దళారులుగా, మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు.

మెడికల్ కౌన్సిల్ చర్యలు

జిల్లాలో నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 14 నకిలీ వైద్య సెంటర్లపై ఆయా పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేయించింది. నల్లగొండ పట్టణంలో దేవరకొండరోడ్డు, ముషంపల్లిరోడ్డు, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు క్లినిక్‌లపై కేసులు నమోదయ్యాయి. ఎన్జీ కళాశాల సమీపంలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్, మునుగోడులో పలు కేంద్రాలు, తిప్పర్తిలో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లపై కేసు నమోదు చేశారు. 2024లో జూన్ 16న మొదటి విడతగా ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేయగా, ఈ ఏడాది జనవరి 8న కేసులు నమోదు చేశారు. తాజాగా, ఈనెల 18వ తేదీన జిల్లాలో 18 నకిలీ వైద్య క్లినిక్‌లపై కేసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రంతో పాటు తిప్పర్తి, మునుగోడు ప్రాంతాల్లో 14మంది నకిలీ వైద్యులపై ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

అడ్డుకట్ట పడేనా?

నకిలీ వైద్యానికి అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఎంబీబీఎస్‌తో సంబంధం లేకుండానే కొంతమంది కార్పొరేట్ ఆస్పత్రులు ఏర్పాటు చేసి రోగుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనవసర పరీక్షలు చేయిస్తూ లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నారు. మెడికల్ షాపుల నిర్వహణ కూడా అదేవిధంగా ఉంది. ఎవరివో సర్టిఫికెట్లతో మెడికల్ షాపులు నిర్వహిస్తూ డాక్టర్ సిఫారసు లేకుండానే మందులు విక్రయించడం నిత్యకృత్యమైంది. రక్త పరీక్షలతో పాటు ఇతర అన్ని పరీక్షలకు సైతం అవగాహన లేని వారు ఉండటం గమనార్హం. రక్తపరీక్షలతో పాటు ఇతర పరీక్షలపై అవగాహన లేకున్నా రోగులకు ఏదో ఒక రిపోర్టు ఇచ్చి లేని జబ్బు అంటగట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రధానంగా మధుమేహం, బీపీ పరీక్షలతో పాటు ఇతర పరీక్షలన్నీ చేస్తూ అవగాహన లేకుండానే రిపోర్టులు ఇచ్చి రోగులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ పూడికతీత

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



నాలాలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 19(ఆంధ్రజ్యోతి): కొన్ని సంవత్సరాలుగా నిర్వహణ లేక చెట్లపొదలు, వ్యర్థాలతో నిండిన డ్రైనేజీ పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం యంత్రాల సహాయంతో చేపట్టిన పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిపాలకులు 15 సంవత్సరాల నుంచి డ్రైనేజీలను శుభ్రం చేయలేదని అన్నారు. ఈ నేపథ్యంలో మురుగు నీరు ప్రవహించే మార్గం లేక పలు వార్డుల్లో ఇళ్లలోకి నీరు చేరి దుర్వాసన వస్తోందని అన్నారు. భరింపరాని దుర్గంధంతో పాటు లోతట్టు ప్రాంత కాలనీ వాసులు అనారోగ్యం గురవుతున్నారని పేర్కొన్నారు. ఏటా డ్రైనేజీ క్లీనింగ్ కోసం లక్షలు ఖర్చు చేస్తున్నట్లు మునిసిపల్ బడ్జెట్‌లో లెక్కలు రాస్తున్నా డ్రైనేజీలు చెత్తతో నిండి ఉండటం విస్మయాన్ని కలిగిస్తుందని అన్నారు. లక్షల నిధులు దుర్వినియోగం కాకుండా వర్షాకాలానికి ముందే మునిసిపల్ ఎక్స్‌కవేటర్, కార్మికులతో కాల్వల పూడికతీత పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ యూసూఫ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): నేరేడుగొమ్ము, చందంపేట మండలాల్లో పోడు భూముల సమస్యలను పరిష్కరించి రైతులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కోరారు. నేరేడుగొమ్ము మండలంలో సోమవారం నిర్వహించిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. నేరేడుగొమ్ము మండలంలో లిఫ్టుల పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు నేరేడుగొమ్ము మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యాసాని పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో గిరిజనసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రమావత్ అంజయ్యానాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె నర్సింహ, దేప సుదర్శన్‌రెడ్డి, బొమ్ము అచ్చయ్య, కురాకుల రమేష్, నాయకులు రామాంజనేయులు, భిక్షం, లక్ష్మయ్య, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

పెద్దవూర, మే 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్ఐ వీరబాబు అన్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు మండలంలోని చలకుర్తి గ్రామంలో సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణకు డీటీఆర్‌బీ, నల్లగొండ పోలీసు కళా బృందం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలని, సీటు బెల్ట్ ధరించాలని అన్నారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది లోకేష్‌రెడ్డి, హరిలాల్, హుస్సేనాయక్, కేఎం.రాజు, పురుషోత్తం, చంద్రశేఖర్, సత్యం, మురళి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

● సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు బంటు గిరి మాట్లాడుతూ కమిషనర్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. కార్యాలయంలో అవినీతిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. మునిసిపల్ ఇంజనీర్ తదితర అధికారులు సాధారణ ప్రజలను నిర్లక్ష్యం చేస్తూ కాంట్రాక్టర్లకు రాచమర్యాదలు చేస్తున్నారని విమర్శించారు. కార్యాలయ పాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని సబ్ కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఓబీసీ విభాగ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు గిరి, నాయకులు మూల రాజిరెడ్డి, వెంకటరమణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా అజ్మీరా రమేష్ బాధ్యతల స్వీకరణ



అజ్మీరా రమేష్

కొండమల్లేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి నూతన ఎస్ఐగా అజ్మీరారమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన ముత్యాల రామ్మూర్తి చింతపల్లికి బదిలీ కాగా ఆయన స్థానంలో దేవరకొండ ఎస్ఐగా అజ్మీరా రమేష్ కొండమల్లేపల్లికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ అజ్మీరా రమేష్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

గురుకుల విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

కొండమల్లేపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో చదివి, ఉపాధి లేని వారికి ఇన్ఫోసిస్ సౌజన్యంతో నిర్వహించే వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కొండమల్లేపల్లి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శౌరీ అన్నారు. 2017 - 20 మధ్య చదివిన 19 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన గురుకుల పూర్వ విద్యార్థులకు రాష్ట్ర సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు కొండమల్లేపల్లిలోని కళాశాలలో మూడు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెన్నారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ



బొడ్రాయి వద్ద పూజల్లో పాల్గొన్న నాయకులు

కొండమల్లేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నారం గ్రామంలో సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ దూదిపాల రేఖా శ్రీధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ జగన్‌నాయక్, దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్ నాయక్, శ్రీనయ్య, గురువాచారి, సాయిలు, వెంకటేష్, విశ్వనాథం, రామకృష్ణ, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి'

దేవరకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. దేవరకొండలో అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకున్నా దేవరకొండలో ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటుందని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సినిమా గైడ్

మిర్యాలగూడ

శ్రీనివాస	: సింగిల్
వెంకటేశ్వర	: మిషన్ ఇంపాసిబుల్
రాఘవ	: హిట్ 3
విట్రోస్	: హిట్ 3, ఫైనల్ డెస్టినేషన్, బ్లడీనెస్, ఎలెవన్

దేవరకొండ

మనోజ్	: మిషన్ ఇంపాసిబుల్, ఫైనల్ రాకింగ్
మైత్రి వెంకటేశ్వర	: యమదొంగ, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్

సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకం



నిడమనూరు : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొండేటి శ్రీను



దేవరకొండ: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నల్ల వెంకటయ్య

నిడమనూరు, దేవరకొండ, పెద్దఅడిశర్లపల్లి, పెద్దవూర, మే 19 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. పేదల కోసం జీవితాన్ని త్యాగం చేశాడని కొనియాడుతూ, సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికై పోరాటాలు చేశాడని గుర్తు చేశారు. భూస్వాములు, పెత్తందారుల నుంచి పేదలకు భూములను పంచిన ఘనత సుందరయ్యకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు కత్తి లింగారెడ్డి, కొమాండ్ల గుర్వయ్య, మల్లికంటి చంద్రశేఖర్, కుంచం శేఖర్, బాలనారాయణ, కేశవులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య మాట్లాడుతూ సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండలకమిటి సభ్యులు బిజిలి లింగయ్య, ఓడపల్లి యాదగిరి, బుడిగె వెంకటేష్, నల్ల రామస్వామి, పర్వత్‌రెడ్డి, రహీం, జ్యోతి, ఎగ్‌బాల్, వెంకటయ్య పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లిలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ నేటి తరానికి ఆయన జీవితం ఎంతో ఆదర్శమని తన జీవితాంతం పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, నాయకులు దేవయ్య, కిరణ్, బుచ్చయ్య, సరిత తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవూరలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె.బషీర్, సీపీఎం మండల నాయకుడు దంతాల నాగార్జున పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని ఉట్లపెల్లి గ్రామంలో సీపీఎం జెండాను దుబ్బ రామచంద్రయ్య ఎగురవేశారు. దున్నే వాడికి భూమి కావాలని తన ఆస్తిని పేదలకు పంచిన గొప్ప వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బ ఏడుకొండలు, దోరేపల్లి మల్లయ్య, గజ్జల కృష్ణారెడ్డి, దుబ్బ కృష్ణ, తిరుమల దుర్గయ్య, అంజయ్య, సునీత, చెన్నయ్య, రామచంద్రయ్య, రమణమ్మ, సైదులు పాల్గొన్నారు.